

నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి శనివారం 14-03-2026 సంపుటి: 01 సంచిక : 269 వేల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Saturday 14-03-2026 Volume :01 Issue: 269 Cost: 2 Pages:08 Editor : Katta HimaPavani





Contact Number
9059328777


## నేటి నుంచి తెలంగాణ

# పదో తరగతి పరీక్షలు

- భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు
- హాల్ టిక్కెట్ చూపిస్తే ఉచిత బస్సు ప్రయాణం
- సకాలంలో సెంటర్‌కు చేరుకోవాలన్న అధికారులు

హైదరాబాద్ - మార్చి 13 (నేటి దర్శిని)
తెలంగాణ రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ భారీగా ఏర్పాట్లు చేసింది. పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. హాల్ టిక్కెట్ -మిగతా 2 లో






## మూసీ పేరిట రేవంత్ లూటిఫికేషన్‌కు వ్యతిరేకం

- మూసీ ప్రక్షాళనకు ముందే పేదలను ఖాళీ చేయిస్తారా
- సీఎం రేవంత్‌కు హరీష్ రావు ప్రశ్నలు

హైదరాబాద్,- మార్చి 13 (నేటి దర్శిని)
బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావు మూసి బ్యూటిఫికేషన్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 8 సూటి ప్రశ్నలు సంధించారు. వీటికి సమాదానం చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ముఖ్యమంత్రి మూసి బ్యూటిఫికేషన్‌పై ప్రెజంటేషన్ ఇస్తున్న సందర్భంగా మొదట తన ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలన్నారు. మూసీ పునరుజ్జీవనానికి బీఆర్ఎస్ ఎప్పుడూ వ్యతిరేకం కాదని, మూసీ పేరిట రేవంతు చేస్తున్న లూటిఫికేషన్ కు మాత్రమే వ్యతిరేకమని ,సుందరీకరణ పేరిట వేలాది మందిని నిరాశ్రయులుగా చేస్తుండటానికి వ్యతిరేకమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ నాయకత్వంలో మొదట మూసీ బ్యూటీఫికేషన్ కు శ్రీకారం చుట్టామని, రూ. 4వేల కోట్లతో 32 ఎస్టీపీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని,
-మిగతా 2 లో



## కోమాలో ఇరాన్ కొత్త సుప్రీం లీడర్?

- మొజ్తబా ఖమేనీకి తీవ్ర గాయాలు
- రెండు కాళ్లు కోల్పోయినట్లు సమాచారం.
- 'ది సన్' సంచలన కథనం!

లండన్:
ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ కోమాలో ఉన్నట్లు బ్రిటన్‌కు చెందిన వార్తాపత్రిక 'ది సన్' పేర్కొంది. దాడుల్లో తీవ్రంగా గాయపడిన ఆయన ఒకటి లేదా రెండు కాళ్లను కోల్పోయినట్లు తెలిపింది. అమెరికా రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సేత్ కూడా ఈ వాదనకు మద్దతు ఇచ్చారు. దాడుల్లో తీవ్రంగా గాయపడిన మోజ్తాబా ముఖం కూడా వికృతంగా మారి ఉంటుందని ప్రెస్ బ్రీఫింగ్‌లో ఆయన అన్నారు.కాగా, ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హతమయ్యారు. ఆయన కుమారుడైన 56 ఏళ్ల మొజ్తబా ఖమేనీ కూడా ఈ దాడుల్లో లేదా ఆ తర్వాత జరిగిన దాడుల్లో తీవ్రంగా గాయపడినట్లు బ్రిటీష్ టాబ్లాయిడ్ 'ది సన్' పేర్కొంది. టెహ్రాన్‌లోని సినా యూనివర్సిటీ ఆసుపత్రిలో గట్టి భద్రత మధ్య ఆయన చికిత్స పొందుతున్నట్లు తెలిపింది. మరోవైపు మొజ్తబా ఖమేనీ చికిత్స గురించి ఒక ఇరాన్ నేత వివరాలు వెల్లడించినట్లు 'ది సన్' తెలిపింది. 'మా నాయుకుడు చాలా తీవ్రమైన స్థితిలో ఉన్నారు. ఒకటి లేదా రెండు కాళ్ళు -మిగతా 2 లో

## మూసీ అభివృద్ధిని బాధ్యతగా

# తీసుకున్నాం

## అద్భుత నగరాన్ని కాపాడుకునే బాధ్యత మనది



- 20 టీఎంసిల గోదావరి జలాలు తరలిస్తాం
- ఎవరు సూచనలు ఇచ్చినా తీసుకునేందుకు సిద్ధం
- వరదలు వస్తే ప్రజలు నిరాశ్రయులు అవుతున్నారు
- నదులను ఆక్రమించుకోవడం వల్లనే వరదలు
- మూసీ ప్రాజెక్టును విమర్శిస్తున్న వారు అక్కడ ఉండగలరా?
- మూసీ ఇన్వైట్స్' కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ - మార్చి 13 (నేటి దర్శిని)
మూసీ అభివృద్ధి బాధ్యతాయుతంగా చేపట్టాలని ప్రయత్నిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విదేశాల్లో పలు నదులను సందర్శించి అధ్యయనం చేశారని, ఇప్పటికీ బృహత్కార్యాచరణ చేపట్టకపోతే భవిష్యత్ తరాలు క్షమించవన్నారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో నిర్వహించిన 'మూసీ ఇన్వైట్స్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రెండేళ్లుగా నిపుణులు, అధికారులతో క్షుణ్ణంగా ప్రతి అంశం పరిశీలించామని చెప్పారు. నిజాంలు, బ్రిటీషర్లు సికింద్రాబాద్ నగరాన్ని నిర్మించారు. ఈసీ, మూసీ వరదల నియంత్రణకు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నిర్మించారు. వందేళ్ల క్రితం నిర్మించిన జలాశయాలు నేటికీ ప్రజల దాహార్తి తీరుస్తున్నాయి. -మిగతా 2 లో



## కూలిన అమెరికా రీఫ్యూయలింగ్ విమానం

- ఇరాక్‌లో కూలినట్లు ప్రకటించిన అమెరికా
- తామే కూల్చామన్న ఇరాక్ రెబల్స్..తోసిపుచ్చిన అగ్రరాజ్యం

వాషింగ్టన్
అమెరికా వాయుసేనకు చెందిన రీఫ్యూయలింగ్ విమానం కేసీ-135 ట్యాంకర్ ఉత్తర ఇరాక్‌లో గురువారం కుప్పకూలింది. అయితే ఈ ప్రమాదంలో ఎంతమంది సిబ్బంది ప్రాణాలు కోల్పోయారో అమెరికా అధికారులు ప్రకటించలేదు. సహాయ కార్యక్రమాలు చేపట్టినట్లు చెబుతున్నారు. ఈ ఘటనపై అమెరికా సెంట్రల్ కమాండ్ ఓ ప్రకటన విడుదల చేసింది. రెండు సైనిక ట్యాంకర్ విమానాలు ల్యాండ్ అవుతుండగా ఈ ఘటన జరిగినట్లు వెల్లడించింది. రెండో విమానం సురక్షితంగా దిగినట్లు పేర్కొంది. మరోవైపు ఇరాక్‌కు చెందిన ఇస్లామిక్ రెసిస్టెన్స్ రెబల్ గ్రూప్ తామే అమెరికా విమానాన్ని కూల్చేసినట్లు ప్రకటించింది. ఈ గ్రూప్ ఇరాన్‌కు అనుకూలంగా పనిచేస్తోంది. ఆ సంస్థ అధికారిక టెలిగ్రామ్ ఛానెల్‌లో ఈ విషయాన్ని వెల్లడించింది. అయితే ఈ ప్రకటనను అమెరికా సెంట్రల్ కమాండ్ తోసిపుచ్చింది.
-మిగతా 2 లో

## ముగిసిన ఇంటర్ పరీక్షలు

- ప్రశాంతంగా ముగిసాయన్న బోర్డు



2 లో

## అసోంలో రూ.4,500 కోట్ల విలువైన ప్రాజెక్టులు



- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన మోడీ
- కామాఖ్య-చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

గువాహటి,- మార్చి 13 (నేటి దర్శిని)
అస్సాం అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారంనాడు ఆ రాష్ట్రంలో పర్యటించారు. రూ. 4,500 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపనలు చేశారు. షెడ్యూల్ ప్రకారం కోకరాఝూర్‌లోని బహిరంగ సభలో మోదీ ప్రసంగించాల్సి ఉన్నప్పటికీ -మిగతా 2 లో

## నేడు జనసేన ఆవిర్భావ దినోత్సవం

### అల్లూరు జిల్లా గిరిజనలతో నేడు పవన్ భేటీ

అమరావతి
మార్చి 14న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ శ్రేణులు వేడుకలకు సిద్ధమయ్యారు. అయితే, ఈ ఏడాది పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని గిరిపుత్రుల మధ్య జరుపుకోవాలని పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిర్ణయించారు.


జనసేన

-మిగతా 2 లో

## దేశంలో గ్యాస్ కొరత లేదు

- ప్యానిక్ బుకింగ్స్ అవసరం లేదు
- కేంద్రప్రభుత్వం స్పష్టీకరణ

న్యూఢిల్లీ, - మార్చి 13 (నేటి దర్శిని)
పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఎల్‌పీజీ కొరత ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో కేంద్రం కీలక ప్రకటన చేసింది. ఎలాంటి భయాందోళనలు వద్దని, 'ప్యానిక్ బుకింగ్' అవసరం లేదని తెలిపింది. సంక్షోభం లేదని వివరించింది. గృహావసరాల కోసం ఎలాంటి అంతరాయం లేకుండా పైపుల ద్వారా సహజ వాయివు , కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ సరఫరాకు భరోసా ఇచ్చింది. -మిగతా 2 లో



## పాకిస్తాన్ ఆర్మీ సెంటర్లపై

# ఆఫ్ఘన్ దాడులు..

- తీవ్రరూపం దాల్చిన సరిహద్దు వివాదం:



- ఒకరిపై ఒకరు బాంబుల వర్షం కురిపించుకుంటున్న పాక్, ఆఫ్ఘన్.
- పాకిస్తాన్ సైనిక కేంద్రాలపై ఆఫ్ఘన్ వైమానిక దాడులు: దెబ్బతిన్న ఆర్మీ స్థావరాలు!
- కోహట్ ఏరియాలోని వార్ కమాండ్ సెంటర్లే లక్ష్యంగా తాలిబన్ల దాడి.
- పాక్ గురువారం జరిపిన దాడులకు శుక్రవారమే బదులిచ్చిన ఆఫ్ఘనిస్తాన్.

న్యూఢీల్లీ - మార్చి 13 (నేటి దర్శిని)
ఒకపక్క ఇరాన్- ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం తీవ్రంగా కొనసాగుతుంటే మరోపక్క పొరుగు దేశాలైన పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ ఒకదానిపై ఒకటి దాడులు చేసుకుంటూనే ఉన్నాయి. ఇటీవల ఇరుదేశాల మధ్య మొదలైన యుద్ధం ఇంకా కొనసాగుతోంది. గురువారం ఆఫ్ఘన్‌పై పాక్ దాడి చేస్తే.. శుక్రవారం పాకిస్తాన్‌పై ఆఫ్ఘన్ దాడి చేసింది. పాకిస్తాన్, ఖైబర్ -మిగతా 2 లో

## మూసీ ప్రక్షాళలను ఎప్పుడూ వ్యతిరేకించలే

- ఇళ్లను కూలగొట్టడంపైనే మా అభ్యంతరం
- మూసీ నీటితో రైతులకు మేలు జరిగితే స్వాగతిస్తాం
- మూసీకి ముందు సబర్మతిపై అధ్యయనం చేయండి
- పదేపదే బిజెపిని విమర్శించడం అపండి
- తెలంగాణ బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు



హైదరాబాద్, - మార్చి 13 (నేటి దర్శిని)
మూసీ ప్రాజెక్ట్‌పై బీజేపీకి వ్యతిరేకత లేదని.. కాని పేదల ఇళ్లు కూల్చడాన్ని మాత్రం వ్యతిరేకిస్తామని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా రాంచందర్ రావు శుక్రవారం హైదరాబాద్‌లో మాట్లాడారు. మూసీపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ పట్ల బీజేపీకి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. మూసీ నది పునరుజ్జీవనానికి కానీ.. -మిగతా 2 లో

## నేటి నుంచి తెలంగాణ
# పదో తరగతి పరీక్షలు

మొదటి తరువాయి

చూపిస్తే దిగాల్సిన చోటు వరకు ఉచితంగా ప్రయాణం కల్పిస్తారు. ఇకపోతే పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని అధికారులు సూచించారు. ఐదు నిముషాల ఆలస్యాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,28,239 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో 5,17,727మంది రెగ్యులర్, ఒకసారి ఫెయిలైన 10,512మంది విద్యార్థులు ఉన్నారు. ఈసారి ప్రైవేటు పాఠశాల నుంచి అత్యధికంగా 2,50,015 విద్యార్థులుండగా, ప్రభుత్వ బడుల నుంచి 2,07,573 మంది, సంక్షేమ గురుకులాల నుంచి 60,139 మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,676 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 1,582 ప్రభుత్వ, 1,094 ప్రైవేటు విద్యాసంస్థలు ఉన్నాయి. హాల్ టికెట్లు ఇప్పటికే అన్ని పాఠశాలకు పంపించామని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తెలిపారు. పాఠశాల గుర్తింపు తెలియకుండా సాధారణ దుస్తుల్లోనే విద్యార్థులు పరీక్షకు రావాలని కోరారు. పరీక్షల పర్యవేక్షణకు 144 ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటుచేశామన్నారు. పరీక్షలు ఉదయం 9:30 నుంచి మద్యాహ్నం 12:30వరకు ఉంటాయి. పదవ తరగతి పరీక్షల సమయం సమీపిస్తున్న కొద్ది విద్యార్థుల్లో ఒత్తిడి మొదలవుతుంది. ఒత్తిడిని జయించడానికి విద్యార్థులు ఏకాగ్రతతో ప్రణాళికబద్దంగా చదివితే మంచి మార్కులతో ఉత్తీర్ణులవుతారని నిపుణులు సూచిస్తున్నారు. ఇతర ఆలోచనలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పరీక్షల సమయంలో సెల్‌ఫోన్, టీవీ వైపు మనస్సు మరలకుండా చూసుకోవాలి. ప్రతిరోజూ విద్యార్థి ఏర్పాటు చేసుకున్న టైం టేబుల్ ప్రకారం చదువుకోవాల్సి ఉంటుంది. సందేహాలను విద్యార్థులు ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలి. అందుకోసం తరగతి ఉపాధ్యాయులు లేదా, మంచి స్నేహితులు, సీనియర్ల ద్వారా సందేహాలను నివృత్తి చేసుకోవాలి. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఇంట్లో చక్కటి వాతావరణం కల్పించాలి. విద్యార్థిలో ఆత్మ విశ్వాసం పెంపొందించేందుకు ప్రతిక్షణం కృషి చేయాలి. అవసరమైన ధైర్యం అందివ్వాలి. పిల్లలు ఎక్కువ సమయం చదువుకే కేటాయిస్తారు కనుక వారి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి సమయానుకూలంగా విద్యార్థికి తగిన పౌష్టికాహారం అందించే ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. సమయానికి తగినంత నిద్రపోయేలా కూడా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేశాం. ఇప్పటికే రెండు ప్రీఫైనల్ పరీక్షలను నిర్వహించి విద్యార్థులకు మనోధైర్యాన్ని కల్పించాం. గణితం, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులలో మంచి మార్కులు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. మార్చి 14 వ తేదీ నుంచి ఏప్రిల్ 16 వరకు పరీక్షలను నిర్వహిస్తున్నాం అని అధికారులు వివరించారు.

# కోమాలో ఇరాన్ కొత్త సుప్రీం లీడర్?

మొదటి తరువాయి

తెగిపోయాయి. కాలేయం, కడుపు కూడా చీలిపోయింది. ఆయన స్పష్టంగా కోమాలో ఉన్నారు' అని ఆ ఇరాన్ నేత అన్నట్లు పేర్కొంది. ఇరాన్ ఆరోగ్య మంత్రి, యుద్ధ గాయాలకు చికిత్స చేసిన అనుభవం ఉన్న సీనియర్ సర్జన్, అనుభవజ్ఞుడైన ట్రామా సర్జన్ మొహమ్మద్ రెజా జఫర్‌ఘండి పర్యవేక్షణలో మొజ్తబా ఖమేనీకి చికిత్స కొనసాగుతున్నట్లు వార్తా కథనంలో పేర్కొంది. కాగా, సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ నుంచి ప్రత్యక్ష ఆదేశాలు లేకుండానే ఇరాన్ నాయకత్వ నిర్మాణం యుద్ధాన్ని కొనసాగిస్తున్నట్లు ఆ నేత స్పష్టం చేశారని 'ది సన్' తెలిపింది. చురుకైన నాయకుడు లేకుండా కూడా ఇరాన్ సైనిక కార్యకలాపాలు కొనసాగే వ్యవస్థను అయతుల్లా అలీ ఖమేనీ ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. 'ఆయన తండ్రి ఒక వ్యవస్థను వదిలి వెళ్ళాడు. ఒక దెయ్యం నడిపేలా అది ఉంది. అందుకే ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు ఇప్పటికీ ఎగురుతున్నాయి. యుద్ధం ఇంకా కొనసాగుతున్నది' అని ఆయన అన్నట్లు 'ది సన్' పేర్కొంది. అయితే 'ది సన్' వార్తా కథనంపై ఇరాన్ స్పందించలేదు. పైగా కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ తొలి సందేశం పేరుతో గురువారం ఒక ప్రకటనను ఇరాన్ ప్రభుత్వ టీవీ ప్రసారం చేసింది. ఇరానియన్ల రక్తానికి ప్రతీకారం తీర్చుకుంటామని, హోర్ముజ్ జలసంధిని అడ్డుకుంటామని ఆయన హెచ్చరించినట్లుగా టీవీ వ్యాఖ్యాత దీనిని చదివి వినిపించారు.

# కూలిన అమెరికా రీఫ్యూయలింగ్ విమానం

మొదటి తరువాయి

శత్రువుల దాడి లేదా ఫ్రెండ్లీ ఫైర్‌లో ఇది కూలిపోలేదని వెల్లడించింది. ఈ ఘటనలో ఆరుగురు సిబ్బంది చనిపోయినట్లు ఇరాన్ మీడియా చెబుతోంది. కేసీ-135 స్ట్రాటోట్యాంకర్‌లో కనీసం ముగ్గురు సిబ్బంది ఉండాల్సి ఉంటుంది. వీరిలో పైలట్, కోపైలట్, ఆపరేటర్ ఉంటారు. వీరితోపాటు నేవిగేటర్, మిషన్ ఆధారంగా అదనపు సిబ్బందిని తరలిస్తుంటారు. ఇరాన్ యుద్ధంలో తీవ్రమైన పనిఒత్తిడి ఉన్న కార్యక్రమం విమానాలకు గాల్లో ఇంధనం నింపడమే. వందల సంఖ్యలో అమెరికా, ఇజ్రాయెల్ విమానాలు దాడులకు వెళుతుండటంతో ట్యాంకర్ విమానాల అవసరాలు గణనీయంగా పెరిగాయి.

# ముగిసిన ఇంటర్ పరీక్షలు
## ప్రశాంతంగా ముగిసాయన్న బోర్డు

**హైదరాబాద్,**

రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభమైన ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షలు పగడ్బందీ ఏర్పాట్లు చేయడంతో ప్రశాంతంగా ముగిశాయని ఇంటర్ బోర్డు కార్యదర్శి వెల్లడించారు. నిరంతర నిఘా, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిఘాను పటిష్టంగా అమలు చేయడం, పరీక్ష కేంద్రాల తనిఖీల వల్ల మాల్ ప్రాక్టీస్ కేసులు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని వెల్లడించారు. గత ఏడాది 2025లో రాష్ట్రవ్యాప్తంగా 115 మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదవగా ఈ యేడాది 54 మాత్రమే కేసులు నమోదయ్యానట్లు వివరించారు. స్టేట్ అబ్జర్వర్లు, హైపవర్ కమిటీ, జిల్లా పరీక్షల కమిటీ, ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లు 10,426 కేంద్రాలను సందర్శించారని పేర్కొన్నారు. గత ఏడాది కంటే 1,876 కేంద్రాలను అధికంగా సందర్శించారని వివరించారు.

# నేడు జనసేన ఆవిర్భావ దినోత్సవం

మొదటి తరువాయి

శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నియోజకవర్గంలోని నందిగరువు గ్రామంలో పవన్ కళ్యాణ్ పర్యటించనున్నారు. ఈ పర్యటనలో మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా పాల్గొంటారు. గిరిజనుల కష్టసుఖాలను తెలుసుకుంటూనే, వారి మధ్యే పార్టీ ఆవిర్భావ వేడుకలను నిర్వహించనున్నారు. తొలుత ఓనూరు జంక్షన్ వద్ద జనసేన జెండాను పవన్ కళ్యాణ్ ఆవిష్కరిస్తారు. అనంతరం 'పీఎం జన్ మన్' (ప్రధాన మంత్రి జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్) పథకం కింద నిర్మించిన రోడ్లను ఆయన స్వయంగా పరిశీలిస్తారు. ఓనూరు జంక్షన్ నుంచి నందిగరువు వరకు నిర్మించిన 2.4 కి.మీ రహదారిని కాలి నడకన ప్రయాణిస్తూ పనుల నాణ్యతను తనిఖీ చేస్తారు. తర్వాత నిర్మాణం పూర్తయిన రహదారులను గిరిజనుల సమక్షంలో ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమం పూర్తి అయిన తర్వాత నందిగరువు గ్రామ ప్రజలతో పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా భేటీ అవుతారు. వారి సమస్యలను అడిగి తెలుసుకునేందుకు 'మాటా-మంతి' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. పర్యటన చివరలో గిరిజనులతో కలిసి పవన్ కళ్యాణ్ మధ్యాహ్న భోజనం చేస్తారు. అధ్యక్షుడి పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని మండల, నియోజకవర్గ కేంద్రాల్లో జనసైనికులు సేవా కార్యక్రమాలను చేపట్టనున్నారు. ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే పార్టీ ప్రధాన లక్ష్యమని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

# మూసీ అభివృద్ధిని బాధ్యతగా తీసుకున్నాం

మొదటి తరువాయి



ప్రపంచ పరిణామాలు, పర్యావరణ మార్పులను పరిగణనలోకి తీసుకోవాలి. అపార మేధో సంపత్తి ఉందని చెప్పేవారు ప్రాజెక్టులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏమైనా తప్పులు చేస్తే సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నాం అని బిఆర్ఎస్‌ను ఉద్దేశించి అన్నారు. మూసీ, ఈసీ సంగమ స్థానం లంగర్ హౌస్ వద్ద బాపూ ఘాట్‌ను పర్యాటక కేంద్రం చేస్తాం అన్నారు. కృష్ణా, గోదావరి జలాలతో ప్రజల దాహార్తి తీర్చాలని ప్రయత్నించాం. గోదావరి జలాలు 20 టీఎంసీలను మూసీకి తరలించే పనులు చేపట్టామని అన్నారు. మూసీలో నిరంతరం 2.5 టీఎంసీల గోదావరి జలాలు ప్రవహించేలా చర్యలు తీసుకుంటున్నాం. మిగతా 17.5 టీఎంసీల గోదావరి జలాలతో హైదరాబాద్ ప్రజల దాహార్తి తీర్చేయత్నం చేస్తున్నాం. ఎంతో ఘనమైన మూసీ చరిత్ర కాలగర్భంలో కలిసిపోతోంది. రాజకీయ ప్రయోజనాల కోసం చరిత్రను కాలగర్భంలో కలిపేద్దామా అని ప్రశ్నించారు. మేం చేపడుతున్న ప్రాజెక్టు ఎవరికీ వ్యతిరేకం కాదు. పాతబస్తీలో మెట్రో, రోడ్ల విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. అభివృద్ధి పనుల కోసం రూ. వేల కోట్లు ఖర్చు పెడుతున్నాం అని వివరించారు. హైదరాబాద్ నగరంలోని చెరువులను పునరుద్ధరిస్తున్నాం. అందుకు ప్రజలు మాకు ఘన స్వాగతం పలుకుతున్నారు. మూసీ అభివృద్ధిని అడ్డుకుంటున్నవాళ్లు.. మూసీ పక్కన నివసిస్తారా? అలాంటి వాళ్లకు కంటెయినర్ హౌస్‌లు ఇస్తా.. అక్కడ నివసిస్తారా? మూసీకి వరదలొస్తే వేలాదిమంది నిరాశ్రయులవుతున్నారు. నీళ్లు ప్రవహించే ప్రాంతాలను మనం ఆక్రమించుకోవడం వల్లే వరదలొస్తున్నాయి. మూసీ ప్రక్షాళన చేయకపోతే నల్గొండ ప్రజలు తీవ్రంగా నష్టపోతారు. భవిష్యత్ తరాలకు కోలుకోలేని దెబ్బ తగులుతుంది. వారి బాధల్ని కూడా పరిగణలోకి తీసుకొని ప్రాజెక్టుపై ముందుకు వెళ్తున్నాం. దీనికి అందరి సహకారం కావాలని రేవంత్‌రెడ్డి అన్నారు. మూసీ ప్రాజెక్టుపై కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రజల్ని ఆందోళనకు గురి చేశారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. మరికొందరు అసంపూర్తి సమాచారంతో తప్పుడు ప్రచారం చేశారన్నారు. ప్రజలకు నిజాలు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఇతర దేశాలు వేగంగా అభివృద్ధి వైపు పయనిస్తున్నాయని తెలిపారు. మనం కూడా అభివృద్ధి వైపు పయనించాలనే మూసీ పునరుజ్జీవం చేస్తున్నట్లు సీఎం రేవంత్ వివరించారు. ప్రజలు మమ్మల్ని నమ్మి అధికారం ఇచ్చారన్నారు. వారికి తాము కాపాలదారులుగా ఉంటామని స్పష్టం చేశారు. సింగపూర్, దుబాయ్, లండన్, సియోల్ నగరాలలో తాను పర్యటించానని చెప్పారు. మనకు ఏం అవసరమో అక్కడ స్టడీ చేసి వచ్చామన్నారు. నదీ పరీవాహక ప్రాంతాల్లోనే ఆర్థిక వ్యవస్థ విరాజిల్లిందన్నారు. గొప్ప నగరం హైదరాబాద్‌ను నిజాం రాజులు మనకు అందించారని తెలిపారు. వందేళ్ల క్రితం నిర్మించిన జలాశయాలు నేటికీ ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయని చెప్పారు. మూసీ అభివృద్ధి బాధ్యతాయుతంగా చేపట్టాలని ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. తమకు పొలిటికల్ డిఫరెన్స్ ఉండొచ్చు.. కానీ పొలిటికల్ పెరాలసిస్ లేదని కుండబద్దలు కొట్టారు. మూసీ పునరుజ్జీవనాన్ని బీఆర్ఎస్, బీజేపీలు ఎందుకు వ్యతిరేకిస్తున్నాయని ఆయన సందేహం వ్యక్తం చేశారు. వ్యతిరేకించడం కాదు.. ఎలా చేద్దామో సలహా ఇవ్వండంటూ ఆయా పార్టీల అధినేతలు, అగ్రనేతలకు సీఎం రేవంత్ సూచించారు. మీ సలహాలు స్వీకరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. ప్రపంచంతో పోటీ పడుతూ అభివృద్ధి జరగొద్దా? అని ఆయా పార్టీల నేతలకు సీఎం రేవంత్ ఈ సందర్భంగా చురకలంటించారు. అపార మేధో సంపత్తి ఉందని చెప్పేవారు ప్రాజెక్టుల్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ నాయకులపై మండిపడ్డారు. పాలసీలు, వర్కింగ్ స్టైల్ మార్చుకున్నామని చెప్పారు. కొద్దిమంది ముఖ్యమంత్రులే ప్రజలకు గుర్తున్నారని పేర్కొన్నారు. వారు వేసిన పునాదులే అలా గుర్తుంచుకునేలా చేశాయని చెప్పారు.

# మూసీ పేరిట రేవంత్ లూటిఫికేషన్‌కు వ్యతిరేకం

మొదటి తరువాయి

గోదావరి నీళ్లను తెచ్చి మూసీలో పోసీ శుద్ధి చేయాలనీ ప్రణాళికలు వేశామని వెల్లడించారు. ఇవాళ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరు చూస్తే తుగ్లన్ పాలన గుర్తుకు వస్తున్నదని ఆరోపించారు. కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించి, అభివృద్ధి పథంలో నడిపిస్తే.. రేవంతు తన తుగ్లక్ పాలనతో అధోగతి పాలు చేస్తున్నడని దుయ్యబట్టారు. . ఒకసారి మూసీ సుందరీకరణ అంటడు, మరోసారి మూసీ ప్రక్షాళన అంటడు, ఇంకోసారి మూసీ పునరుజ్జీవం అంటడు. పూటకో పేరు మార్చుతూ, రోజుకో చోట ప్రజల ఇండ్లు కూల్చే హక్కు మీకు ఎవరు ఇచ్చారని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన మీద చిత్తశుద్ధి ఉన్న వారెవరు మొదలు మొదలే పేదల ఇండ్ల మీద పడరు . వికారాబాద్ నుంచి ఇక్కడి వరకు మురుగు నీటిని ఆపకుండా ప్రక్షాళన ఎలా చేస్తవు ? అంటూ నిలదీశారు. ఖజానా ఖాళీ అంటూనే, లక్షా 50వేల కోట్లకు టెండర్ పెట్టాడని విమర్శించారు. మూసీని బాగు చేయలనే చిత్తశుద్ధి ఉంటే మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించి అక్కడి ప్రజలతో మాట్లాడి అభిప్రాయాలు తీసుకోవాలని, ÷వ్ స్టార్ హోటల్లలో, నీ జూబ్లీ హిల్స్ ప్యాలెస్ లో ఏసీల్లో కూర్చొని కాగితాలు తిరగేస్తే ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. ఎలాంటి డీపీఆర్ , ప్రణాళిక లేకుండా మూసీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న నివాసాలను కూల్చుతూ, భయభ్రాంతులకు గురి చేయడం దారుణమని అన్నారు.

# మూసీ ప్రక్షాళలను ఎప్పుడూ వ్యతిరేకించలే

మొదటి తరువాయి



మూసీ ప్రాజెక్ట్‌ను కానీ బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకించలేదని తెలిపారు. మూసీ నది హైదరాబాద్ నగరం నుంచి కృష్ణానదిలో కలిసే వరకు పరిశుభ్రంగా ఉండాలని.., అందులో స్వచ్ఛమైన నీరు ప్రవహించాలని.. ఆ నీరు రైతులకు సాగునీటి కోసం ఉపయోగపడాలని తమ పార్టీ కోరుకుంటోందని తెలిపారు. అయితే ఈ అంశంపై కాంగ్రెస్ నేతలు పదేపదే తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి కానీ, మంత్రి పొన్నం ప్రభాకర్ కానీ.. బీజేపీపై రకరకాల వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. కానీ మూసీ విషయంలో బీజేపీ వైఖరి మొదటి నుంచీ ఒకటేనని గుర్తు చేశారు. మూసీ నది తప్పకుండా పునరుజ్జీవనం కావాలని తమ పార్టీ ఇప్పటికీ చెబుతుందన్నారు. కానీ 'గాంధీ సరోవర్' పేరుతో అక్కడ నివసిస్తున్న పేద, మధ్య తరగతి కుటుంబాల ఇళ్లను కూల్చడం అంగీకారయోగ్యం కాదన్నారన్నారు. మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ వంటి ప్రాంతాల్లో చట్టబద్ధంగా నిర్మించిన ఇళ్లను కూల్చాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆ ఇళ్లను కూల్చకుండానే మూసీని శుద్ధి చేయవచ్చునన్నారు. సబర్మతి నదిని ఉదాహరణగా తీసుకునే వారు.. ముందుగా అసలు అక్కడ ప్రాజెక్టు ఎలా ఏర్పాటు చేశారో తెలుసుకోవాలంటూ కీలక సూచన చేశారు. ఒకప్పుడు సబర్మతి సైతం మూసీలా కాలుష్యంతో, దుర్వాసనతో ఉండేదని గుర్తుచేశారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత.. నర్మదా నది నుంచి నీటిని సబర్మతికి మళ్లించి, నదుల అనుసంధానం చేయడం ద్వారా ఆ నదిని శుభ్రపరిచారని చెప్పారు. అక్కడ నివసిస్తున్న పేద కుటుంబాలను ముందుగా పునరావాసం కల్పించి.. ప్రత్యామ్నాయ గృహాలు ఇచ్చిన తర్వాతే ప్రాజెక్టు చేపట్టారని గుర్తు చేశారు. సుమారు 4 వేల కుటుంబాలకు ప్రత్యామ్నాయ గృహాలు ఇచ్చిన తర్వాతే అభివృద్ధి పనులు చేపట్టారని, ప్రజల జీవితం దెబ్బతినకుండా జరిగేదే నిజమైన అభివృద్ధి అని పేర్కొన్నారు. మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలను నిరాశ్రయులను చేయడాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. అభివృద్ధి పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లు కూల్చడం అన్యాయమన్నారు. గాంధీ సరోవర్ కోసం భూమి అవసరమైతే ప్రాజెక్టును రియలైన్ చేసుకోవచ్చని సూచించారు. ఒక్క ఇల్లు కూడా దెబ్బతినకుండా ప్రణాళిక రూపొందించాలన్నారు. గాంధీ విగ్రహం నిర్మించాలనుకుంటే వెయ్యి అడుగులైనా, రెండువేల అడుగులైనా ఆకాశాన్ని తాకేలా నిర్మించొచ్చని, దానికి బీజేపీకి ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు. కానీ పేదల ఇళ్లు కూల్చి వారి జీవనాధారాన్ని దెబ్బతీస్తే మాత్రం బీజేపీ తప్పకుండా వ్యతిరేకిస్తుందని హెచ్చరించారు. ముందుగా మూసీని శుద్ధిచేసి, ఆ తర్వాత అభివృద్ధి పనులు చేపట్టాలని, దానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. దేశంలో గ్యాస్, ఆయిల్, డీజిల్, పెట్రోల్ దొరకవని ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం పూర్తిగా బాధ్యతారాహిత్యమని అన్నారు. రాహుల్ గాంధీ వంటి కాంగ్రెస్ నేతలు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ప్రపంచంలో యుద్ధాలు, ఉద్రిక్తతలు ఉన్నప్పుడు వాటి ప్రభావం ప్రపంచవ్యాప్తంగా, భారతదేశంపైనా కనిపించవచ్చని, కానీ అదే పేరుతో దేశంలో కొరత వస్తుందని భయాందోళనలు సృష్టించడం సరికాదన్నారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్, ప్రధాని నరేంద్ర మోదీ.. సంబంధిత దేశాల నాయకులతో మాట్లాడి, భారతదేశానికి రావాల్సిన చమురు, గ్యాస్ సరఫరా హోర్ముజ్ జలసంధి ద్వారా అంతరాయం లేకుండా దేశానికి చేరేలా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. భారతదేశం ఒకే ప్రాంతంపై ఆధారపడదని, దాదాపు 40 శాతం ముడి చమురు ఇతర దేశాల నుంచీ వస్తోందని చెప్పారు. అందువల్ల దేశంలో గ్యాస్ సిలిండర్లు, పెట్రోల్, డీజిల్ కొరత ఉండదన్నారు.

# పాకిస్తాన్ ఆర్మీ సెంటర్లపై ఆఫ్ఘన్ దాడులు..

మొదటి తరువాయి

పంక్తుంఖ్వాలోని ఆర్మీ కేంద్రాలపై శుక్రవారం వైమానిక దాడులు జరిపినట్లు ఆఫ్ఘనిస్తాన్‌లోని తాలిబన్ ప్రభుత్వం వెల్లడించింది. ఈ దాడుల్లో పాకిస్తాన్‌కు ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందని వెల్లడించింది. పాకిస్తాన్ జరిపిన దాడులకు ప్రతీకారంగానే ఈ దాడులు చేసినట్లు తెలిపింది. పాకిస్తాన్ గురువారం రాత్రి ఆఫ్ఘన్‌లోని కొన్ని స్థావరాలపై దాడి చేసింది. ఆఫ్ఘన్ తీవ్రవాద స్థావరాలపై దాడులు చేసినట్లు పాక్ తెలిపింది. ఈ దాడుల్లో సాధారణ పౌరులు మరణించినట్లు ఆఫ్ఘన్ తెలిపింది. దీంతో తాము కోహట్ ఏరియాలోని పాకిస్తాన్‌కు చెందిన కీలక స్తావరాలపై దాడి చేశామని తెలిపింది. దురంద్ లైన్ వద్ద వార్ కమాండ్ సెంటర్, ఫోర్ట్ కమాండర్లే లక్ష్యంగా ఈ దాడి చేశామని చెప్పింది. దాడుల ద్వారా ఇక్కడి నివాస ప్రాంతాల్ని కూడా ధ్వంసం చేసినట్లు ఆఫ్ఘన్ వివరించింది. తీవ్రవాద సమస్య కారణంగా పాక్, ఆఫ్ఘన్ పరస్పర దాడులకు దిగుతున్నాయి. తమ దేశంలోకి ఆఫ్ఘనిస్తాన్ తీవ్రవాదుల్ని పంపి విధ్వంసం సృష్టిస్తోందని పాక్ ఆరోపిస్తోంది. ఈ ఆరోపణల్ని ఆఫ్ఘన్ నేతలు ఖండిస్తున్నారు. పాక్‌లోని భద్రతా వైఫల్యం వల్లే ఆ దేశంలో దాడులు జరుగుతున్నాయని తెలిపింది. రెండు దేశాల మధ్య ఉన్న 2,600 కిలోమీటర్ల పొడవైన దురండ్ లైన్ వెంబడి ఉద్రిక్తతలు తలెత్తుతున్నాయి. బ్రిటీష్ కాలం నాడు ఏర్పర్చిన ఈ సరిహద్దును ఆఫ్ఘన్ అంగీకరించడం లేదు. ఇలాంటి అనేక అంశాల్లో ఇరు దేశాల మధ్య విబేధాలున్నాయి.

# దేశంలో గ్యాస్ కొరత లేదు

మొదటి తరువాయి

పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ శుక్రవారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ, ఆసుపత్రులు, హాస్టల్స్‌కు ఎల్‌పీజీ సరఫరాకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. మార్చి 2026తో పోల్చుకుంటే దేశంలో ఎల్‌పీజీ ఉత్పత్తి 40 శాతం పెరిగిందని, అదనంగా రాష్ట్రాలకు 48,000 కిలోలీటర్ల (సుమారు 48 మిలియన్ లీటర్లు) కిరోసిన్ పంపిణీ చేశామని తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్లకు బొగ్గు సరఫరా చేయాలని కోల్ ఇండియాను ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు. మధ్యప్రాచ్యంలో యుద్ధానికి ముందు యావరేజ్‌గా 55.7 లక్షల బుకింగ్‌లు ఉంటే మార్చి 12 నాటికి అది 75.7 లక్షలకు పెరిగిందని, భయాల కారణంగానే బుకింగ్‌లు అనూహ్యంగా పెరిగాయని సుజాతా శర్మ తెలిపారు. ఎల్పీజీపై ఒత్తిడి తగ్గేందుకు పీఎన్‌జీ కనెక్షన్లకు మళ్లాలని ప్రజలను కోరారు. క్రూడాయిల్‌కు సంబంధించి 258 మిలియన్ మెట్రిక్ టన్నుల ర్గి÷ల్గ÷నింగ్ కెపాసిటీ మనకు ఉందని, పెట్రోల్, డీజిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని కలిగి ఉన్నామని వివరించారు. ప్రధానమైన అర్బన్ సిటీలు, కేంద్రాల్లో కమర్షియల్ వినియోగదారుల ఆందోళన, సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని చెప్పారు. కమర్షియల్ వినియోగదారులు స్థానిక సీజీడీ (సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్) నెట్‌వర్క్ ప్రొవైడర్‌ను కానీ, సంబంధిత డీలర్‌ను కానీ సంప్రదించి పీఎన్‌జీ కనెక్షన్ పొందవచ్చని సూచించారు. దేశంలోని అన్ని పెట్రోల్ పంపుల్లో తగినన్ని పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని, బంక్‌లు ఖాళీ అయినట్టు 25,000 డిస్ట్రిబ్యూటర్లలో ఏ ఒక్కరి నుంచీ తమకు సమాచారం లేదని సుజాతా శర్మ తెలిపారు. వదంతులను విశ్వసించవద్దని, ప్యానిక్ బైయింగ్‌కు దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అసోంలో రూ.4,500 కోట్ల విలువైన ప్రాజెక్టులు

వాతావరణ ప్రతికూలత కారణంగా వేదిక వద్దకు చేరుకోలేకపోయారు. దీంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. అస్సాం అభివృద్ధికి రూ.4,500 కోట్లతో పలు పనులు ప్రారంభించామని, ఇందులో రూ.1,100 కోట్లు బోడోలాండ్ ప్రాంతంలోని రోడ్ల కోసం ఖర్చు చేయనున్నామని చెప్పారు. అస్సాం మేళా ఇనీషియేటివ్ మూడో దశలో అస్సాంలో రోడ్ల అనుసంధానం మరింత పటిష్టమవుతుందని అన్నారు. ఈ సందర్భంగా కామాఖ్య-చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్, గౌహతి-న్యూ జల్‌పాయ్‌గురి ఎక్స్‌ప్రెస్‌లను మోదీ జెండా ఊపి ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ బోడోలాండ్‌ను తప్పుడు హామీలతో దశాబ్దాలుగా వంచించిందని, బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే బోడోలాండ్ ప్రాంత ప్రజల కలలు సాకారమయ్యాయని అన్నారు. అటు కేంద్రంలో, ఇటు అస్సాంలో కాంగ్రెస్‌కు ప్రజలు ఉద్వాసన చెప్పి బీజేపీ-ఎన్డీయేకు అవకాశం ఇవ్వడంతో చిత్తశుద్ధితో తాము అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. కాంగ్రెస్ వివిధ గ్రూపుల మధ్య అసంతృప్తిని పెంచితే, శాంతి కోసం బీజేపీ పాటుపడిందని, బోడో పీస్ ఒప్పందంపై సంతకం చేసి అన్ని ప్రధాన సంస్థలు, గ్రూపులను ఏకతాటిపైకి తెచ్చిందని చెప్పారు. అస్సాంలో చొరబాటుదారులను కాంగ్రెస్ ప్రోత్సహించిందని, గిరిజనుల భూములను అక్రమంగా చొరబాటుదారులకు కట్టబెట్టిందని మోదీ విమర్శించారు. అయితే గిరిజనుల భూములు వారికే తిరిగి ఇప్పించేందుకు ముఖ్యమంత్రి శర్మ అవిశ్రాంతంగా కృషి చేశారని కొనియాడారు.

## చైతన్య భారతి హై స్కూల్ విద్యార్థిని విద్యార్థులందరికీ ముందుగా ఆల్ ద బెస్ట్ తెలియజేసిన కరస్పాండెంట్ వై.రాజేందర్ రెడ్డి



చైతన్య భారతి హై స్కూల్ కరస్పాండెంట్ వై. రాజేందర్ రెడ్డి



**మిడ్జిల్, మార్చి 13, (నేటి దర్శిని ప్రతినిధి) :** మిడ్జిల్ మండల కేంద్రంలోని చైతన్య భారతి హై స్కూల్ కరస్పాండెంట్ వై.రాజేందర్ రెడ్డి ప్రకటన తెలియపరుస్తూ.. పదవ తరగతి పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థిని, విద్యార్థులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. విద్యార్థులందరూ ఏకాగ్రతతో చదివి పరీక్షలు మంచిగా వ్రాయాలని, కష్టపడి మిమ్మల్ని చదివిస్తున్న తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, మీ పాఠశాలలకు, మీ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాను. విద్యార్థులందరూ సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని,ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు వ్రాసి మంచి ఫలితాలు సాధించాలి అని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.. ధైర్యంగా ముందడుగు వేసి సాధన, కృషి,పట్టుదల,జిజ్ఞాస ఆత్మవిశ్వాసంతో ప్రయత్నిస్తే విజయం మీ సొంతం అవుతుంది వారు తెలియపరిచారు

## అక్రమంగా నిల్వ ఉంచినరే రేషన్ బియ్యం పట్టివేత



**మిడ్జిల్, మార్చి13 (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** మద్దూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపల్లి మండ లం బునేడ్ గ్రామంలో అక్ర మంగా పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచినట్లు వచ్చిన సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు మద్దూరు పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 19 బస్తాలు 7 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ను స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచిన వ్యక్తిగా బునేడ్ గ్రామానికి చెందిన మహ్మద్ ఆదిల్ ను గుర్తించారు. ఈ ఘటనపై డి టి పంచనా మ అనంతరం సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు మద్దూరు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. ప్రభుత్వం పేదలకు అందిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచడం, తరలించడం లేదా విక్రయించడం చట్ట విరుద్ధ మని, అలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.


# ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం..



**ఆమనగల్,మార్చి13(నేటి దర్శిని ప్రతినిధి);** నరేంద్ర మోడీ రైతులకు అందిస్తున్న పిఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా 22వ విడత నిధులు విడుదల చేసిన సందర్భంగా ఆమనగల్ పట్టణంలో బిజెపి శ్రేణులు ప్రధానమంత్రి చిత్రపటానికి పాలాభిషేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గీతా చారి మాట్లాడుతూ దేశంలోని ప్రతి రైతుకు వ్యవసాయం కొరకు సహాయం కింద రెండు వేల రూపాయల చొప్పున అందించే ఈ పథకం రైతులకు ఎంతో మేలు చేస్తుందని తెలిపారు.రైతుల ఖాతాలకు నేరుగా డబ్బులు జమ కావడం వల్ల ఎలాంటి మధ్యవర్తులు లేకుండా రైతులకు సహాయం అందుతుందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో జన్ ధన్ బ్యాంకు ఖాతాల ద్వారా నేరుగా రైతుల అకౌంట్ లలో డబ్బులు జమ చేయడం ఒక విప్లవాత్మక మార్పు అని అన్నారు.రైతుల ఆదాయం రెట్టింపు చేయాలని లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న పథకాలు వ్యవసాయ రంగానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. రైతులకు నేరుగా ఆర్థిక సహాయం అందిస్తూ వారి జీవితాలను బలోపేతం చేయడంలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ ఈ పథకాన్ని అమలు చేస్తున్న భారత ప్రభుత్వానికి మరియు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సునీత ప్రశాంత్,ఎర్రవోలు మహేష్,ముక్తాల వెంకటయ్య,ధూళి మాల్యా,మాజీ కౌన్సిలర్లు ఝాన్సీ శేఖర్,శ్రీకాంత్ సింగ్,శ్రీశైలం యాదవ్ ,చెన్నకేశవులు,చెక్కల లక్ష్మణ్,గోరటి నరసింహ మరియు కేకే, విక్రమ్ రెడ్డి,బీజేవైఎం కో కన్వీనర్ రవి రాథోడ్ ,పద్మ ప్రశాంత్, అల్లాజీ గౌడ్,రవి గౌడ్,జంతుక జానయ్య,గంజి శ్రీను, పార్టీ సీనియర్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణం





**యాచారం, మార్చి 13 (నేటిదర్శిని):** భక్తజన సందోహం నడుమ భక్తి భావం సంతరించుకోగా భక్తిశ్రద్ధలతో కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తుల పాలిట కొంగుబంగారంగా తిరుమలేశుని గుట్టపై వెలసిన వెంకటేశ్వర స్వామి అలివేలు మంగా కల్యాణ మహోత్సవం వేద పండితుల మంత్రోచ్ఛరణాల,వాయిద్యాల నడుమ పట్టు వస్త్రాలు అలంకరించి ముత్యాల తలంబ్రాలు సమర్పించి కళ్యాణం భక్తజన సందడి నడుమ వైభవంగా జరిగింది. వివాహాన్ని తిలకించేందుకు భక్తజనులు వేలాదిగా తరలివచ్చారు. యాచారం పరిసర ప్రాంతాల్లో వెంకటేశ్వర నామం మార్మోగింది. కల్యాణోత్సవంలో సర్పంచ్ మస్కు అనిత శరణం, ఆలయ కమిటీ సభ్యులు రెడ్డి వెంకట్ రెడ్డి, నాయిని సుదర్శన్ రెడ్డి, ఉప్పల భాస్కర్, భక్తులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అకాల మరణం చెందిన మహిళా హోంగార్డు నాగమణి కుటుంబానికి తోటి హోంగార్డుల ఆర్థిక సహాయం





● ఎస్పీ డి.జానకి చేతుల మీదుగా నగదు అందజేత

**మిడ్జిల్, మార్చి13, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ కార్యాలయంలో శు క్రవారం జరిగిన కార్యక్రమంలో ఇటీవల అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించిన మహిళా హోంగార్డు నాగమణి (HG-297) కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. గత నెల 16వ తేదీన మహిళా హోంగార్డు నాగమణి గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు. ఆమె కుటుంబానికి తోడ్పాటుగా జిల్లా వ్యాప్తంగా ఉన్న హోంగార్డులు అందరూ కలిసి స్వచ్ఛందంగా రూ. 1,01,116/- (ఒక లక్ష ఒక వెయ్యి నూట పదహారు రూపాయలు) పోగుచేసి, నాగమణి కుమారుడు శ్రీనివాసులు గారికి అందజేశారు. ఈ మొత్తాన్ని జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ గారి చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ, తోటి హోంగార్డు కుటుంబం కష్టాల్లో ఉన్నప్పుడు అందరూ కలిసి పెద్ద మనసుతో సహాయం చేయడం ఎంతో అభినందనీయమని తెలిపారు. ఇలాంటి సంఘీభావం పోలీస్ కుటుంబంలో ఉన్న ఐక్యతను, మానవత్వాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. నాగమణి పోలీస్ శాఖకు అందించిన సేవలను స్మరించుకుంటూ, ఆమె కుటుంబానికి భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయం అందించేందుకు పోలీస్ శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో హోంగార్డ్స్ ఇంచార్జ్ ఆర్.ఐ. అశోక్ కుమార్, ఎం.టి.ఓ నాగేష్, ూ= హెడ్ కానిస్టేబుల్స్ శ్రీనివాసులు, స్వామి గౌడ్ తదితర హోంగార్డ్ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం చివరలో నాగమణి ఆత్మకు శాంతి చేకూరాలని అందరూ నివాళులు అర్పించారు.

## రిషి టాలెంట్ హై స్కూల్లో శివశక్తి యూత్ పరీక్ష ప్యాడ్ల పంపిణీ.....



**ఆమనగల్, మార్చి13(నేటి దర్శిని ప్రతినిధి);** ఆమనగల్ పట్టణంలోని రిషి టాలెంట్ హై స్కూల్ లో శుక్రవారం 10వ తరగతి పరీక్షలు రాసే విద్యార్థిని, విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, జామెట్రీ బాక్సులు, శివశక్తి యూత్ సభ్యులు పంపిణీ చేశారు. రిషి టాలెంట్ హై స్కూల్ లోని30 మందికి పరీక్ష ప్యాడ్ లను పంపిణీ చేస్తూ కమిటీ సభ్యులు ఎంగలి శ్రీధర్ మాట్లాడుతూ మంచిగా చదువుకొని పరీక్షలు రాసి చదువులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రిషి టాలెంట్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు అవ్వారి నిరంజన్, గుద్దేటి మహేష్ నేత,జజ్జాల నవీన్,గుండ్రాతి కుమార్ గౌడ్, జాటావత్ తరుణ్,యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు

## నూతన ఎస్ హెచ్ ఓ కి అభినందనలు తెలిపిన మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు



**ఆమనగల్, మార్చి13(నేటి దర్శిని ప్రతినిధి):** ఆమనగల్ ఎస్ హెచ్ ఓ గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎస్ వెంకటేశ్వర్లు ను శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయంలో ఆమనగల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చాలను అందించి శాలువాలతో సత్కరించి ఆయనను అభినందించారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఆయన వెంట ఆర్యవైశ్య సంఘం నాయకులు బికుమాండ్ల రమేష్ గుప్తా,జూలూరి గోపాల్,శ్రీను నాయక్ ,తదితరులు ఉన్నారు.

## మాల ప్రజా ప్రతినిధుల సన్మానానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



**ఉమ్మడి వరంగల్, మార్చి 13 (నేటి దర్శిని బ్యూరో):** మాల ప్రజాప్రతినిధుల సన్మాన కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించారు. ఈనెల 15న ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ప్రజా ప్రతినిధులకు సన్మానం నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ఆహ్వానానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు ఉపాధ్యక్షులు మన్నే బాబురావు, హనుమకొండ జిల్లా అధ్యక్షులు పనికిల శ్రీనివాస్ , మల్లం రాజకుమార్, నరసయ్య, రాము, గద్దె నరసయ్య ,గొర్రె రమేష్, ప్రకాష్, బెజ్జం పాపారావు తదితరులు పాల్గొన్నారు.

# ఏకాత్మ మానవతా వాదం ప్రపంచానికి దిక్సూచి:బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్




**ఉమ్మడి వరంగల్, మార్చి 13 (నేటి దర్శిని బ్యూరో):** పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆలోచనలు అంత్యోదయ భారత్ కి ఎంతో అవసరమని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ పేర్కొన్నారు. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాఅభియాన్2026 కార్యక్రమం కరీమాబాద్ మండల అధ్యక్షులు బోరిగం నాగరాజు అధ్యక్షతన రోటరీ క్లబ్ హాల్లో నిర్వహించిన కార్యాశాలలో పాల్గొని సైద్ధాంతిక భూమిక లోని ఏకాత్మ మానవతా వాదం కాలాంశాన్ని కార్యకర్తలు ఉద్దేశించి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ప్రసంగించారు. ఈ సందర్భంగా కాలాంశంలో భాగంగా ఉద్దేశించి మాట్లాడుతూ మన భారతీయ సంస్కృతిలో అనేక విలువలున్నాయనే విషయాన్ని మరిచిపోయి, పాశ్చాత్య స్వార్థపూరిత, వ్యక్తివాద, పెట్టుబడిదారీ విలువలను ఈ రోజుల్లో ఆచరిస్తూ, సమాజంలో మానవతనుమంటగల్పుతున్నారన్నారు. స్వాతంత్ర్య అనంతర కాలంలో ఈ విషయాన్ని పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రహించి భారతీయ జనసంఘ్ రాజకీయ పార్టీని భారతీయ విలువల అమలు కోసం ఏకాత్మ మానవవాద సిద్ధాంతాన్ని పార్టీ తాత్విక సిద్ధాంతంగా తీసుకుని పార్టీని పటిష్టపరిచారు. అదే బీజేపీగా అవతరించి, భారతీయ సాంస్కృతిక విలువలను మళ్లీ అమలు పరచడం ప్రారంభించిందన్నారు. ఆ పార్టీ సాంస్కృతిక జాతీయవాదాన్ని పటిష్టంగా అమలుపరుస్తున్నదనీ పండిట్ దీన్ దయాళ్ దూరదృష్టికి నిదర్శనమని తెలిపారు. ఆయన దేశంలోని ప్రతి వ్యక్తికి ఉపాధి ఉండి, ఉత్పత్తికి దోహదపడాలని, ప్రభుత్వాలు విద్య, వైద్యం ఉచితంగా అందించాలని కోరుకున్నారు. ఆయన తాత్విక సిద్ధాంతాల ఆధారంగానే బీజేపీ అనేక పథకాలు రూపకల్పన చేసి పేదవారికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించిందన్నారు. ఆయన తాత్విక సిద్ధాంతాల పునాదుల మీద భారత్ స్వశక్తి, స్వాభిమానం, ఆత్మనిర్భర్ భారత్ గా ఉండి ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగిందన్నారు. విశ్వ మానవ స్ఫూర్తితో ఏకాత్మ మానవతావాదం సిద్ధాంతాలను అనుసరిస్తున్నారు. ఈ రోజు దేశంలో అసమానతలు తగ్గుతున్నా యని, పేదరికం తగ్గుతోందనీ, ప్రజలందరూ అభివృద్ధి చెందుతుందన్నారు. వారికి ఆధ్యాత్మికంగా స్పష్టమైన అభిప్రాయాలు ఉండాలని, అప్పుడే క్రమబద్ధమైన అభివృద్ధి సాధ్యమవుతుందని, విలువలతో కూడిన జీవనం అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రజలందరూ విలువలతో కూడిన అభివృద్ధిని చూస్తే దేశం ఎంతో ముందడుగు వేస్తుందన్నారు.

ఈ రోజు బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా అవతరించింది. కమ్యూనిజం, కేపిటలిజం వల్ల వస్తున్న ఎన్నో దుష్పరిణామాలను అణిచివేస్తూ ఏకాత్మతా మానవతావాదం సిద్ధాంతంతో దేశాన్ని వెలుగుల వైపు నడిపిస్తున్నారు. భారతీయ సంస్కృతి, గాంధీ సిద్ధాంతాలైన సర్వోదయ, స్వదేశీ, హిందుత్వ భావజాలాన్ని సమన్వయం చేసుకుని సామాజిక సమానత్వాన్ని సమర్థించడం. రాజకీయాలను ప్రజా సేవగా భావించి ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ఆయన ఆలోచనలను మేక్ ఇన్ ఇండియా, వోకల్ ఫర్ లోకల్ వంటి కార్యక్రమాలలో ప్రతిబింబిస్తోందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ దాన్ని అనుసరిస్తూ దేశ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యశాలలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, జిల్లా ఉపాధ్యక్షులు, ప్రశిక్షణ జిల్లా కోకన్వీనర్ కందిమల్ల మహేష్, బైరి నాగరాజు, ప్రశిక్షణ మండల కన్వీనర్ వంచనగిరి రాజ్ కుమార్, బిజెపి జిల్లా నాయకులు మాచర్ల దీన్ దయాళ్, మదాసు రాజు, టేకుమట్ల రేణుక, మండల పదాధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కళ నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

● పేదల మొహంలో చిరునవ్వు చూడటమే మా ప్రజా ప్రభుత్వ ధ్యేయం



**ఉమ్మడి వరంగల్, మార్చి 13 (నేటి దర్శిని బ్యూరో):** ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సహకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే తెలిపారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 45వ డివిజన్ పరిధి లోని తరాలపల్లి గ్రామానికి చెందిన సింగారపు అరుణ ,వెంకటేష్ దంపతులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రభుత్వం నుంచి కేటాయించిన 5 లక్షల ఆర్థిక సహాయంతో తమ ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నారు. శుక్రవారం కొత్త ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కార్ నాగరాజు ముఖ్యతిధిగా పాల్గొనిగృహప్రవేశంచేసివారి కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూఇందిరమ్మ రాజ్యంలో పేదలసొంతింటికలనెరవేరుతుందని పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అన్నారు. పేదల ముఖంలో చిరునవ్వు చూడటమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం అని పేర్కొన్నారు. గత పాలకులు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అని చెప్పి పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు నిజమైన న్యాయం జరుగుతోందని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో మరింత మంది పేదలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే నాగరాజు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కర్ర హరీష్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎం.డి బషీర్, డివిజన్ నాయకులు నర్మెట్ట వెంకటరమణ గౌడ్, సదానందం, శ్రీనివాస్ రెడ్డి, నీలం రజినీ, గుర్రం జ్యోతిబస్కే ప్రణయ్, కృష్ణ తో పాటు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చండూరు సెంటర్లో ఆస్పిరేషనల్ టాయిలెట్ ఏర్పాటు

● మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులకు హెల్త్ క్యాంప్


● పారిశుద్ధ్య కార్మికులకు పిపిఈ కిట్ల, సబ్బుల పంపిణీ




**చండూర్,మార్చి 13 (నేటి దర్శిని):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపడుతున్న “ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక” 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమములో భాగంగా శుక్రవారం నాడు చండూరు పట్టణ ప్రజలకు మరియు అవసరాల నిమిత్తం ఇతర గ్రామాల నుండి వచ్చే ప్రజల సౌకర్యార్థం కొత్త అస్పిరేషనల్ టాయిలెట్ ను మెయిన్ సెంటర్ నందు నిర్మాణముకు ప్రారంభోత్సవం చేయడం జరిగింది. తదుపరి పారిశుధ్య సిబ్బంది మరియు ఆఫీస్ సిబ్బందికి స్థానిక గెస్ట్ హౌస్ నందు హెల్త్ క్యాంపు నిర్వహించడం జరిగింది మరియు మున్సిపల్ ఆఫీస్ నందు పారిశుధ్య సిబ్బందికి గ్లౌజు కిట్లు మరియు సబ్బులు పంపిణి కార్యక్రమములు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, మున్సిపల్ కమీషనర్ ఎల్. మల్లేశం మరియు పాలకవర్గం అధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. అదేవిధంగా సాయిబాబా దేవాలయం దగ్గర మరియు బస్టాండ్ దగ్గర ఉన్న వాటర్ ట్యాంకులను శుభ్రం చేయడం జరిగినది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యచరణలో భాగంగా ప్రతి కార్యక్రమాన్ని విధిగా నిర్వహిస్తున్నామని, అద్భుతమైనటువంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారికి ధన్యవాదాలు తెలిపారు. వివిధ గ్రామాల నుండి వస్తున్న ప్రజల అవసరాల మేరకు చండూరు సెంటర్లో కొత్త ఆస్పిరేషన్ టాయిలెట్లను నిర్మిస్తున్నామని, అదేవిధంగా త్వరలో బస్సు షెల్టర్ ను ఏర్పాటు చేస్తామని అన్నారు. మున్సిపాలిటీలోని పారిశుధ్య కార్మికులందరూ ఆరోగ్యంగా ఉండాలని, వారి ఆరోగ్యం కోసమే హెల్త్ క్యాంప్ ను నిర్వహించామని తెలిపారు. ఇట్టి కార్యక్రమములలో వైస్ చైర్ పర్సన్ భూతరాజు దశరథ, గ్లౌజ డా. రాజు, కౌన్సిల్ సభ్యులు శ్రీమతి తేలుకుంట్ల రాజకుమారి, బుషిపాక వాసు, సామ సుజాత, జెల్ల ధనమ్మ, కోర్నెడ్డి మధు, కోడి సుష్మవెంకన్న, కలిమికొండ పారిజాత, కటకం రమేష్ గార్లు, వార్డు ఆఫీసర్స్ రాములు,సాయి రామ్,ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ వీ.అరవింద్ రెడ్డి, ఆశ వర్కర్లు, ANM లు, పారిశుధ్య సిబ్బంది, బిల్ కలెక్టర్స్, వాటర్ మెన్స్, ఎలక్ట్రిషియన్స్ మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# ఉమ్మడి వరంగల్ లో సూర్యుడి ప్రతాపం......!

● ప్రజల అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన



**ఉమ్మడి వరంగల్, మార్చి 13 ( నేటి దర్శిని బ్యూరో):** ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు .ఉదయం8 గంటల వరకు వాతావరణం చల్లగా ఉన్నప్పటికీ, మధ్యాహ్నం వడగాల్పుల తీవ్రత ఎక్కువ ఉన్నందున ప్రజల అప్రమత్తంగా ఉండాలని ఎంజీఎం వైద్యులు సూచించారు. ప్రజలు తప్పనిసరి బయటికి వెళ్ళవలసి వస్తే తలకు టోపీ , తెల్లటి రుమాలు ధరించాలని ఎండవేడికి జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా 12 గంటల లోపు సాయంత్రం 5:00 తర్వాతే పనులుపూర్తి చేసుకోవాలని వైద్యులు పేర్కొన్నారు. నేటి నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నందున 12:30 తర్వాత పరీక్షలు రాసి బయటకు వచ్చే విద్యార్థులు రెండోవేడికి అప్రమత్తంగా ఉండాలని తెలుపుతున్నారు. ఇప్పటికే ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తయినందున ఎండలో విద్యార్థులు తిరగకుండా భవిష్యత్తు చదువుల కోసం టైం కేటాయించాలని మేధావులు తెలుపుతున్నారు. చిన్నపిల్లలు ,వయోవృద్ధులు తప్పనిసరిగా త్రాగునీరు వెంట తీసుకుని బయటికి వెళ్లాలని సాయంత్రం మాత్రమే పనులు ముగించుకోవాలని వైద్యులు అంటున్నారు.

# ఉమ్మడి వరంగల్ జిల్లాలో వానర సైన్యం సైరవిహారం..!

భయభ్రాంతులతో ప్రజలు పట్టించుకోని అధికారులు



**ఉమ్మడి వరంగల్, మార్చి 13 (నేటి దర్శిని బ్యూరో):** ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పట్టణ, గ్రామీణప ప్రాంతాల్లో కోతులు సైరవిహారం చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా ఇండ్ల మధ్యలో సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇండ్ల నుంచి పనుల నిమిత్తము బయటకు వెళ్లడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ కి వెళ్లి సామాన్లు తీసుకుని వచ్చే మార్గమధ్యంలో కోతులు గమనించి ప్రజలపై దాడి చేసి కాటు వేస్తున్నాయని విచారం వ్యక్తం చేస్తున్నారు. దీంతో హాస్పిటల్ పాలు కావాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇటీవల కాలంలో కోతుల సైరవిహారం పెరిగిపోయిందని, ఈ విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులకు తెలిపినప్పటికీ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలం రావడంతో కోతులకు నీరు, ఆహారం దొరకకపోవడంతో ప్రజల పైన దాడి చేస్తున్నాయని పరిశీలకులు అంటున్నా రు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ , మున్సిపల్ ఎన్నికల ముందు కోతుల బెడద లేకుండా చేస్తామని పలు గ్రామాల్లో హామీ ఇచ్చారని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా గ్రామ సర్పంచ్ లు అధికారులు స్పందించి కోతుల బెడదను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

# ఘనంగా కవయిత్రి మొల్లమాంబా జయంతి వేడుకలు



**కొండ మల్లెపల్లి, మార్చి 13 ( నేటి దర్శిని):** నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గశీ కొండమల్లేపల్లి మండల కేంద్రం లో కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ రామాయణ కవయిత్రి, భక్త శిరోమణి ఆతుకూరి మొల్లమాంబా జయంతి వేడుకలను శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లమాంబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కుమ్మరి సంఘం నాయకులు మాట్లాడుతూ, తెలుగు సాహితీ వనంలో మొల్లమాంబా ఒక అరుదైన కుసుమమని కొనియాడారు. సామాన్య కుటుంబంలో జన్మించి, తన ప్రతిభతో ‘మొల్ల రామాయణం’ రచించి చిరస్థాయిగా నిలిచిపోయారని, ఆమె పట్టుదల మరియు సాహిత్య సేవ నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. కుమ్మరి కుల బాంధవులందరూ ఆమె ఆశయాలను స్మరించుకుంటూ, సామాజికంగా మరియు విద్యాపరంగా అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సంఘం నాయకులు తోటపల్లి కిరణ్, మాడుగుల యాదగిరి, బొడ్డుపల్లి ఎల్లయ్య, నీలకంఠం రాములు, ఏరుకొండ రాములు, బొడ్డుపల్లి మల్లయ్య, తోటపల్లి వెంకటయ్య, సిలివేరు శ్రీధర్, బొడ్డుపల్లి మల్లికార్జున, నెల్లికంటి గోపి, తోటపల్లి వెంకటేష్, తోటపల్లి శ్రీనివాస్, బొడ్డుపల్లి రామకృష్ణ, వెంకటాపురం నాగేష్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ట్రాక్టర్లు దొంగిలించిన ఇద్దరు నిందితులు అరెస్ట్

● వాహనాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు

**మిడ్జిల్ మార్చి 13:( నేటి దర్శిని ప్రతినిధి):** వ్యవసాయ పనులు ముగిసిన తరువాత పొలాల వద్ద ఉంచిన ట్రాక్టర్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను మిడ్జిల్ పోలీసులు గురువారం రాత్రి పట్టుకున్నారు.ఈసందర్భంగా శుక్రవారం జడ్చర్ల పోలీస్ స్టేషన్ డి.ఎస్.పి వెంకటేశ్వర్లు సిఐ నాగరాజు నాగార్జున గౌడ్ ఎస్సై శివ నాగేశ్వర్ నాయుడు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు వారి వద్ద నుండి దొంగిలించిన రెండు ట్రాక్టర్లు, రెండు ట్రాలీలు మరియు ఒక ప్లాటినా బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన నందిగం పాపరావు (34) జీవనోపాధికి కూలీ పని చేస్తూ ఉండేవాడు. మూడు నెలల క్రితం వరి కుప్పలు తీయుటకు మిడ్జిల్ మండలం కొత్తూరు గ్రామానికి వచ్చాడు. ఆ సమయంలో అక్కడి రైతులు వ్యవసాయ పనులు ముగించుకొని తమ ట్రాక్టర్లను పొలాల వద్ద బహిరంగంగా ఉంచి ఇళ్లకు వెళ్లడం గమనించాడు.సులభంగా డబ్బులు సంపాదించాలని భావించిన అతను ట్రాక్టర్లు దొంగిలించి వాటిని తన ప్రాంతానికి తీసుకెళ్లి గుర్తు తెలియని వ్యక్తులకు అమ్మాలని యోచించాడు. ఈ విషయాన్ని తన స్నేహితుడు బొడ్డుపల్లి చంద్రశేఖర్‌కు చెప్పగా అతను




కూడా సహకరించాడు.ఈ నేపథ్యంలో గత ఫిబ్రవరి మూడవ వారంలో ఇద్దరూ ప్లాటినా బైక్ (AP07BM8362) పై కొత్తపల్లి గ్రామం నుండి మిడ్జిల్ మండలంలోని కొత్తూరు గ్రామానికి వచ్చి ఫిబ్రవరి 18 అర్ధరాత్రి సమయంలో జాన్ డీర్ ట్రాక్టర్ (TS06UC9056) మరియు దాని ట్రాలీ (TS06UC9057) ను దొంగిలించారు. అనంతరం ఊర్కొండపేట గ్రామ సమీపంలోని సూర్యజ్యోతి కాటన్ మిల్ వద్ద పొదల్లో దాచిపెట్టారు.అలాగే మార్చి 9 రాత్రి సుమారు 11 గంటల సమయంలో మరోసారి కొత్తూరు గ్రామంలోని రైతు పొలంలో ఉన్న మహీంద్రా ట్రాక్టర్ (TS06UC9146) మరియు దాని ట్రాలీ (TS06UC9147) ను దొంగిలించి అదే ప్రాంతంలో దాచిపెట్టారు.మరొక దొంగతనం చేయాలనే ఉద్దేశంతో గురువారం మార్చి 12 రాత్రి బైక్ పై మిడ్జిల్ నుండి కల్వకుర్తి వైపు వెళ్తుండగా బోయిన్పల్లి ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న మిడ్జిల్ ఎస్.ఐ.శివ నాగేశ్వర్ కి అనుమానం వచ్చి ఆపి విచారించగా దొంగతనాలు వెలుగులోకి వచ్చాయి.పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి ప్లాటినా బైక్‌తో పాటు రెండు ట్రాక్టర్లు, రెండు ట్రాలీలను స్వాధీనం చేసుకున్నారు.

## జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన TUWJ (IJU) బృందం



**మిడ్జిల్, మార్చి13, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో ):** మహబూబ్‌నగర్ జిల్లా నూతన కలెక్టర్‌ను శుక్రవారంరోజు మహబూబ్‌నగర్ జిల్లా TUWJ (IJU) కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గారికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.జిల్లాకు నూతన కలెక్టర్ రాక పట్ల యూనియన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. సమర్థులైన అధికారి నేతృత్వంలో జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, ప్రజా సమస్యల పరిష్కారంలో జర్నలిస్టుల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మరియు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న 12వ వార్డు కౌన్సిలర్ నాగిళ్ల జగన్......



**ఆమనగల్, మార్చి13,(నేటి దర్శిని ప్రతినిధి);** ఆమనగల్ మున్సిపాలిటీ ఎన్నికలలో ఇచ్చిన హామీల లో భాగంగా మృతి చెందిన కుటుంబాలకు తన సొంత నిధులతో 5000 రూపాయలు ఇస్తానని వాగ్దానం చేసిన 12వ వార్డు కౌన్సిలర్ నాగిళ్ల జగన్ ఆ వాగ్దానాన్ని అమలుపరిచారు. శుక్రవారం 12వ వార్డు పరిధిలో శాంతినగర్ కాలనీలో ఇద్దరూ మృతి చెందారు. కౌన్సిలర్ నాగిళ్ల జగన్ ఇచ్చిన హామీ ప్రకారం మృతి చెందిన వారికి వారి కుటుంబాలకు నగదుతో పాటు తన ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ వారి పార్థివ దేహం పై పూలమాలలు వేసి సంతాపం వ్యక్తపరిచారు. మృతిచెందిన గడిగే నరసింహ,మరియు కర్నాటి లక్ష్మమ్మ వారి కుటుంబ సభ్యులకు ఎన్నికల ప్రచారంలో తన సొంత మ్యానిఫెస్టోలో పొందుపరిచినట్లుగానే వీరి కుటుంబాలకు చెరో 5000 /చొప్పున గడిగే నరసింహకుటుంబానికి 5000 రూపాయలు, కర్నాటి లక్ష్మమ్మ కుటుంబానికి 5000 రూపాయల చొప్పున నాగిల్ల జగన్ వారికి అందజేశారు.ఈ ఈ కార్యక్రమంలో తాళ్ల రఘు, గడిగే నగేష్,ఎండి అజీమ్,గడిగే రవి,ఎండి ముక్తార్,ఎండి మజాహిద్,పల్లె శివ,పల్లె కిషోర్,గడిగే అంజి,రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## దశదిన కార్యక్రమానికి హాజరైన రామ్నుంతల సర్పంచ్ శ్రీను నాయక్....



**ఆమనగల్,మార్చి13(నేటి దర్శిని ప్రతినిధి);** ఆమనగల్ మండలంలోని రామ్నుంతల గ్రామ సర్పంచ్ వడుత్యావత్ శ్రీను నాయక్ కల్వకుర్తి మాజీ శాసనసభ్యులు గుర్కా జైపాల్ యాదవ్ తల్లిగారి దశదినకర్మ కార్యక్రమానికి శుక్రవారం హాజరైనారు. జైపాల్ యాదవ్ మాతృమూర్తి చిత్రపటానికి కల్వకుర్తి మాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్ తో కలిసి వారి అమ్మగారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ కొరతతో ఎలక్ట్రిక్ స్టవ్ లకు పెరిగిన గిరాకీ...!



**ఉమ్మడి వరంగల్, మార్చి 13 (నేటి దర్శిని బ్యూరో):** ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎలక్ట్రిక్ స్టవ్ ల కు గిరాకీ పెరిగింది. యుద్ధ ప్రభావంతో ఏర్పడిన వంట గ్యాస్ కొరతను అధిగమించడానికి ప్రత్యమాన్యంగా ఎలక్ట్రికల్ స్టవ్ ల వినియోగం పెరిగింది. గ్యాస్ కంపెనీలకు బుకింగ్ చేసి 10 రోజులు దాటిన గ్యాస్ ఇంటికి చేరకపోవడంతో చాలామంది ఎలక్ట్రికల్ స్టవ్ లు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 50 కి పైగా గ్యాస్ కంపెనీల డీలర్ ఉన్నప్పటికీ, 4 రోజుల్లో 2 వేలకు పైగా అమ్ముడైనట్లు తెలిసింది. హోటలలో ,గ్రామీణ ప్రాంతాల్లో ప్రాచీన కాలం నాటి కట్టెల పొయ్యిలను వాడుకోవడానికి సిద్ధమయ్యారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి : నాగూర్ల వెంకటేశ్వర్లు

**ఉమ్మడి వరంగల్, మార్చి 13 (నేటి దర్శిని బ్యూరో):** రైతు లకు నాణ్యమైన విత్తనాలు అందిస్తేనే డీలర్స్ ను ఎక్కువగా నమ్ముతారని, రాష్ట్రా అభివృద్ధిలో డీలర్స్ పాత్ర కీలకమని తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్స్,పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్,డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగుర్ల వెంకటేశ్వర్లు అన్నారు. వరంగల్ శివనగర్ లోని ది వరంగల్ ఫర్టిలైజర్స్,ఫెస్టిసైడ్స్ అండ్ సీడ్స్,డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర కార్యవర్గం ఏదైనా నిర్ణయం తీసుకుంటే ఆ నిర్ణయాన్ని కొనసాగించాల్సినటువంటి బాధ్యత డీలర్ల అందరి పైన ఉందని, తప్పకుండా పాటించాల్సినటువంటి అవసరం ఉందన్నారు. కార్యవర్గంలో చర్చించి నిర్ణయం తీసుకున్న తర్వాత ఆ నిర్ణయాన్ని కట్టుబడి, ఆ నిర్ణయం పట్ల మనమందరం కూడా తన వంతు పాత్రను పోషించాలన్నారు. జై జవాన్ జై కిసాన్ నిజంగా మనం కూడా రైతు రాజు కావడానికి మన వంతు పాత్ర ఉందన్నారు. క్వాలిటీ పాటించాలని,రైతుకు మనం వెన్ను దండగా ఉండాల్సినటువంటి బాధ్యత మన పైన ఉందన్నారు.రైతులకు అందుబాటులో ఉండి నాణ్యమైన విత్తనాలు, నాణ్యమైన పురుగు మందులు



అందించాలన్నారు. క్వాలిటీ విషయంలో కాంప్రమైజ్ కావద్దని,నాణ్యమైనటువంటి కంపెనీ విత్తనాలను మాత్రమే రైతులకు అందించాలని మీ అందరికీ కోరుకుంటున్నానని అన్నారు. విత్తనాన్ని పరీక్షించిన తర్వాతనే మనం రైతు కు అమ్మాలి తప్ప, ఏ విత్తనాన్ని , ఏ పురుగుమందు ను కూడా ట్రయాల్ చూడకుండా ప్రమోట్ చేయవద్దనే విషయాన్ని గుర్తు చేశారు.రైతుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత మన పైన ఉందన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మండల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి వరకు కూడా కమిటీలను పటిష్టం చేయాల్సినటువంటి పరిస్థితి ఉందని,అవన్నీ కూడా జిల్లాల వారిగా ఇంకా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని,వరంగల్ జిల్లాలో మాదిరిగా మన ఆత్మగౌరవ భవనాన్ని రాష్ట్ర స్థాయిలో కూడా తప్పకుండా భవన నిర్మాణం మీ అందరి సహకారంతోటి పూర్తి చేస్తానని అన్నారు.ఎవరైనా వచ్చినా కూడా ఒక రెస్ట్ తీసుకోవడానికి కొన్ని రూమ్స్ ఇవ్వాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించుకున్నామని, తప్పకుండా మీ అందరి యొక్క సహకారం తో బిల్డింగ్ నిర్మాణాన్ని చేసి తప్పకుండా నెరవేరుస్తామని తెలిపారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామడుగు మనోహర్ మాట్లాడుతూ డీలర్స్, డిస్ట్రిబ్యూటర్స్ కు ఎటువంటి కష్టమొచ్చినా అండగా ఉండాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎవరు కూడా పని చేయకూడదని అన్నారు.రాష్ట్ర కోశాధికారి సిద్ధి నాగరాజు మాట్లాడుతూ భవన నిర్మాణానికి కావలసినటువంటి నిధులను సేకరించి భవన నిర్మాణం త్వరలో చేపడతామని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బొద్ది రెడ్డి నరసింహారెడ్డి,రాష్ట్ర నాయకులు సత్యనారాయణ రెడ్డి,కేదారి,పాండురంగయ్య, వివిధ జిల్లాల నాయకులు మాడిశెట్టి అశోక్,శేఖర్,రతన్,రాజేందర్ రెడ్డి, రమేష్,రవి,అమూల్య ప్రవీణ్, సదానందం, మురళి తదితరులు పాల్గొన్నారు.

## ఉపసర్పంచులకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

- ●లేకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనకు పిలుపునిస్తాం
- ●అప్పటి ప్రభుత్వం అన్ని ఆలోచించే ఉపసర్పంచ్ లకు చెక్ పవర్ ఇచ్చింది
- ●ఉప సర్పంచ్ల చెక్ పవర్ తీసేసే అధికారం ఎవరికి లేదు
- ●కొత్తూరు పాపి రస్ పోర్ట్ లో ఉప సర్పంచ్లు మీడియా సమావేశంలో వెల్లడి

**కొత్తూర్ మార్చ్ 13 ( నేటి దర్శిని ప్రతినిధి )** ఉప సర్పంచ్ల చెక్ పవర్ రద్దు చేయాలని కలెక్టర్కు మెమొరండం ఇచ్చిన సర్పంచ్ లు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని పెంజర్ల ఉపసర్పంచ్ శంతన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఉప సర్పంచ్ల చెక్ పవర్ ను రద్దు చేయాలని కోరుతూ కలెక్టర్కు వినతిపత్రం ఇచ్చిన నేపథ్యంలో కొత్తూరు మండల ఉపసర్పంచ్లు పాపి రస్ పోర్ట్ లో శుక్రవారం ప్రెస్ మీట్ ను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పెంజర్ల ఉపసర్పంచ్ శంతన్ రెడ్డి మాట్లాడుతూ..అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వము అన్ని ఆలోచించే ఉపసర్పంచ్ లకు చెక్ పవర్ ఇచ్చిందన్నారు. ఉపసర్పంచ్ల చెక్ పవర్ తీసేసే అధికారం ఎవరికి లేదని చెప్పారు.ఇప్పటికైనా సర్పంచ్






ఎర్రోళ్ల జగన్ ఉపసర్పంచ్ లకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. ఎస్ బి పల్లి ఉపసర్పంచ్ సున్నాల గణేష్ మాట్లాడుతూ..ఎర్రోళ్ల జగన్ వెంటనే క్షమాపణ చెప్పకపోతే ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం ఆయా గ్రామాల ఉపసర్పంచులు మాట్లాడుతూ.. సర్పంచులు ఉప సర్పంచులు కలిసి అభివృద్ధికి పాటుపడాలని అన్నారు.ఉప సర్పంచులు వార్డు మెంబర్లతో కలిసి అభివృద్ధి పటంలో నడవాలని సర్పంచ్లకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్లు ఎండి సిరాజ్,ఆరోగ్యం,వెంకటమ్మ, స్వరూప, స్వప్న రాందాస్,హనుమంత్ నాయక్, డోపాలా యాదయ్య,వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కోట్ల రూపాయల భూ బాగోతంపై శీత కన్ను

- సంగెంలో భూ మాయ - 3
- భూదాన్ భూములంటే ఇంత అలుసా
- అన్యాక్రాంతమైనా ఆటవిడుపేనా
- 'సంగెం' భూదాన్ భూములపై అధికారుల మౌనం
- ఎవరికోసం ఈ మెహర్బానీ
- లిఖిత పూర్వక ఫిర్యాదులున్నా స్పందన సున్నా
- రియల్టర్ల ధనదాహానికి అధికారుల కక్కుర్తి..?



**షాద్ నగర్ 13 మార్చ్ (నేటి దర్శిని ప్రతినిధి ):** పేద ప్రజలకు ఉండాల్సిన భూములను గద్దల్లా పెద్దలు తన్నుకు పోతుంటే చోద్యం చూస్తున్న వారే తప్పిస్తే అడ్డుకోడానికి ప్రయత్నించేవారు ఏ ఒక్కరు లేకపోవడం విడ్డూరకరమైన విషయం. బడా వ్యాపారులు, రియల్టర్ల ధనదాహానికి అధికారుల కక్కుర్తి తోడవడంతో ఎంతో ఆశయంతో పేదలకు పంచిన భూదాన్ భూములు ఒక్కొక్కటిగా చేతులు మారుతూ అన్యాకాంతమవుతున్నాయి. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం సంగెం గ్రామంలోని భూస్వామి ఇక్రమ్ అలీ ఖాన్ గొప్ప ఆశయంతో తనకున్న భూమి నుండి కొంత భాగాన్ని పేదలకు పంచాలని గ్రామంలోని సర్వే నెంబర్ 32 నందు భూథాన్ యజ్ఞ బోర్డుకు సమర్పించాడు. అలా భూములను స్వాధీనం చేసుకున్న భూదాన్ బోర్డు గ్రామంలోని రైతులకు సాగు చేసుకుని జీవనం సాగించాలని కేటాయించింది. కాలక్రమేన పేద రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని అమ్మడానికి కొనడానికి వీలులేని, వీలు పడని ఈ భూదాన్ భూములను డబ్బున్న వ్యాపారులు, పెద్దలు తమ పలుకుబడి ఉపయోగించి ఏకంగా రిజిస్టర్ చేసుకోవడం కాకుండా రికార్డులో కూడా తమ పేర్లపై మార్చుకున్నారు. ఇంకొొందరైతే ఏకంగా అవి సాగు పనికిరాని భూములను నాలాకన్వర్షన్ కూడా చేయించారు. ఇటీవలే సంగెం




గ్రామంలోని 32/7 సర్వే నెంబర్ లో 10-29 గుంటల భూమి అన్యాక్రాంతం అయిందని పెద్ద ఎత్తున సాక్షాదారాలతో సహా పత్రికల్లో, సోషల్ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. పేద ప్రజల నుండి చేతులు మారిన ఆ భూమిలో దిండి గోదావరి సంస్థ రిసార్టులను ఏర్పాటు చేసేందుకు పూర్తిగా పథకం రచించినట్లు స్పష్ట మవుతుంది. రెవెన్యూ రికార్డుల్లో భూమి అని చూపుతున్నా కాసుల వేటలో ఉన్న కొందరి అధికారుల కారణంగా అక్రమ కన్వర్షన్, పేరు మార్పిడి జరిగిపోయాయనే ఆరోపణలున్నాయి. ఈ భూ బాగోతం విషయంలో పెద్ద ఎత్తున కథనాలు వచ్చినప్పటికీ ప్రస్తుతం రెవెన్యూ యంత్రాంగంలో పనిచేస్తున్న అధికారులు నోరు మెదపక పోవడం వెనక సర్వత్రా విమర్శలు వెల్లడవుతున్నాయి. కోట్ల రూపాయల విలువైన భూములు పక్కదారి పడుతున్నాయంటే కూడా అధికార యంత్రాంగం చలించకుండా ఎందుకు ఉంటుందని, కనీసం విచారణ చేయక పోవడం వెనక ఏం మతలబు దాగుందనే ప్రశ్నలు వేల్లడవుతున్నాయి. సంగెం గ్రామంలోని ఈ భూదాన్ భూములపై గత సంవత్సరం సెప్టెంబర్ నెలలోనే షాద్ నగర్ రెవెన్యూ డివిజనల్ అధికారికి లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఆర్డీవో కు ఫిర్యాదు చేసి ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ అధికార యంత్రాంగం మాత్రం పట్టనట్లు వ్యవహరించినట్లు తెలుస్తుంది. భూదాన్ భూములు అన్యాకాంతం అయ్యాయని ఆధారాలతో సహా అధికారులకు ఫిర్యాదు చేస్తే వారు మాత్రం షరా మామూలే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారుల మౌనం వెనుక బడా వ్యాపారుల హస్తం దాగి ఉందా...? లేక ఆర్థిక లావాదేవీల వ్యవహారం ఏమైనా ఉందా ? అంటూ స్థానికంగా ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రజల ఆరోపణలకు అద్దం పట్టినట్లుగానే అధికారుల వ్యవహారం ఉండటంతో సంగెం గ్రామంలోని భూదాన్ భూముల వ్యవహారంలో పెద్ద ఎత్తున లాబీయింగ్ జరిగినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే గ్రామంలోని 32 సర్వే నెంబర్ లో ప్రస్తుతం దిండి బై గోదావరి రిసార్ట్స్ పేరుతో ఉన్న భూదాన్ భూములతో పాటు అదే సర్వే నెంబర్ లో ఉన్న మరిన్ని భూదాన్ భూములు కూడా ఇదే విధంగా పక్కదారి పట్టినట్లు తెలుస్తుంది. ఈ సందర్భంగా స్థానికుల, బాధిత రైతుల సమాచారం మేరకు రోజుకో ఆసక్తికరమైన విషయాలు, అక్రమాలు బయట పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది..

# బూర్గుల రామకృష్ణారావు జయంతిని మరిచిన నాయకులు..

- బూర్గులను మరిచిపోయారా సారు..?
- షాద్ నగర్ లో బోసిపోయిన విగ్రహం..
- తెలంగాణ తొలి ముఖ్యమంత్రికి అవమానం



**షాద్ నగర్ 13 మార్చ్ (నేటి దర్శిని ప్రతినిధి):** బూర్గుల అంటే ఒక పేరు కాదు బ్రాండ్.. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా, 14 భాషలలో కోవిదుడుగా, కవిగా, స్వతంత్ర పోరాట యోధుడిగా, రక్షిత కౌలుదారు చట్టం ద్వారా నిరుపేదలకు భూములు పంచిన సేవకుడిగా బహుముఖ ప్రజ్ఞ ఆయన సొంతం. ఆయన ఫరూక్ నగర్ మండలం బూర్గుల గ్రామ నివాసి కావడం ఇక్కడి ప్రజల అదృష్టం. కానీ ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే ఆయనను గుర్తు చేసుకుని నాయకులు, కులాల వారీగా నివాళులు అర్పించడం అలవాటు చేసుకున్న ప్రజా సంఘాలు బూర్గుల రామకృష్ణారావును మరిచిపోయాయి. కనీసం కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఈ మహా నాయకుడిని ఆ పార్టీ నాయకులు కూడా గుర్తుంచుకోలేదు. ఆయన జయంతిని పురస్కరించుకొని కనీసం ఒక పూలదండ వేసి నివాళు లు కూడా అర్పించలేదు. బూర్గుల అభిమానులు ఇది ఆయనకు జరిగిన అవమానంగా భావిస్తున్నారు. ఎన్నికలు వస్తే తప్ప దేశానికి సేవ చేసిన మహా నాయకులు ఇప్పటి నాయక గణాలకు గుర్తురారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన బ్రాహ్మణుడు అయినప్పటికీ దళితుల భూముల కోసం పోరాడిన మహా వ్యక్తి. కనీసం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కూడా ఆయనకు నివాళులు అర్పించకపోవడం శోచనీయం. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కూడా కూతపేట్టు దూరంలో ఉంటుంది అయినా కూడా అధికార పార్టీ నాయకులు కూడా ఎక్కడ నివాళి అర్పించిన దాఖలాలు లేవు..

# మోదీ పాలనలో తెలంగాణ రహదారులకు మహర్దశ

- బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి



బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి

**మిడ్జిల్,మార్చి 13, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో తెలంగాణ వ్యాప్తంగా రహదారులకు మహర్దశ వచ్చిందని, అదేవిధంగా ఉర్కొండ మండల అభివృద్ధికి వివిధ గ్రామాలకు 70 లక్షల నిధులు మంజూరు చేసిన పార్లమెంట్ సభ్యురాలుడీకే. అరుణ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డిఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2014 నుంచి ఇప్పటివరకు తెలంగాణలో 5,000కి.మీ. జాతీయ రహదారులు నిర్మాణం జరిగిందన్నారు. భారత్ మాల ప్రాజెక్టు కింద 38,297 కోట్ల వ్యయంతో 1,719 కి.మీ. జాతీయ రహదారుల అభివృద్ధి జరిగిందన్నారు. తాజాగా 3,175.08 కోట్లతో జాతీయ హైవే167 గుడెబల్లూర్ -- మహబూబ్‌నగర్ మార్గం 4 లేన్లకు విస్తరణకు ఆమోదం తెలిపిందన్నారు. ప్రధాన మంత్రి సడక్ యోజన ద్వారా 12,000 కి.మీ. పైగా గ్రామీణ రహదారుల నిర్మాణం.మోదీ పాలనలో తెలంగాణ రహదారుల ప్రగతి జరగడం ప్రతిష్టాత్మకమని అన్నారు.

# హెల్మెట్ లు దరిద్దాం ప్రాణాలను కాపాడుకుందాం

- డయోగ్నోస్టిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం
- బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి



**షాద్ నగర్ 13 మార్చి (నేటి దర్శిని ప్రతినిధి):** మోటార్ సైకిల్ పై ప్రయాణం చేసేవారు తప్పకుండ హెల్మెట్ ధరించి సురక్షితంగా మీ గమ్యాలకు చేరాలని అన్నారు. ప్రపంచ ల్యాబ్ టెక్నీషియన్ డే సందర్భంగా తెలంగాణ డయోగ్నోష్టిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం షాద్ నగర్ పట్టణంలో స్థానిక బుగ్గారెడ్డి గార్డెన్ లో నిర్వహించడం జరిగింది. ఈయొక్క కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అందే బాబయ్య, ఏసీపీ లక్ష్మీనారాయణ హాజరుకావడం జరిగింది. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ షాద్ నగర్ నియోజకవర్గంలో ప్రమాదాల వల్ల అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. మోటార్ సైకిల్ పై ప్రయానించే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించే విదంగా పోలీస్ శాఖ తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ దరిస్తే ప్రమాధాలు తగ్గుతాయని అన్నారు. రక్తదానం చేయడం వల్ల ప్రమాధాల్లో గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రాణాలు నిలబెట్టిన వారు అవుతారని అన్నారు. రక్త దానం చేసిన వారిని విష్ణువర్ధన్ రెడ్డి అభినందించడం జరిగింది. ఈయొక్క కార్యక్రమంలో డాక్టర్ అనురాగ్ రెడ్డి, అరవింద్, యువసత్త లక్ష్మణ్, పోతుల శ్రీకాంత్, అనిల్ కుమార్ గౌడ్, శ్రవణ్ కుమార్,చెవుల బాస్కర్,దినేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

# వరంగల్ నగరం మతసామరస్యానికి ప్రతీక: ఎమ్మెల్యే



**ఉమ్మడి వరంగల్, మార్చి 13 (నేటి దర్శిని బ్యూరో):** వరంగల్ నగరం మతసామరస్యానికి ప్రతీక అని ,ఫాతిమా మాత ఆశీస్సులతో నగర ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆకాంక్షించారు. కాజీపేట ఫాతిమా నగర్ చర్చిలో శుక్రవారం నిర్వహించిన ఫాతిమా మాత మహోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, మత పెద్దలు, విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో పదో పరీక్షలకు 43, 007 మంది విద్యార్థులు




**ఉమ్మడి వరంగల్, మార్చి 13 (నేటి దర్శిని బ్యూరో):** ఉమ్మడి వరంగల్ జిల్లాలో పదో తరగతి పరీక్షలకు అధికారులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 43,007 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. ఈనెల 14 నుంచి ఏప్రిల్ 16 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని వరంగల్ జిల్లాలో 9492 మంది విద్యార్థులు, హన్మకొండ జిల్లాలో 12079 మంది, మహబూబాబాద్ జిల్లాలో 8157 మంది, భూపాలపల్లి జిల్లాలో 35 44 మంది, జనగామ జిల్లాలో 64 45 మంది, ములుగు జిల్లాలో 3290 మంది విద్యార్థులు పరీక్షల కు హాజరు కావలసి ఉంది. ఉదయం 9:30 నుంచి మ మధ్యాహ్నం 12:30 వరకు పరీక్షలు జరగనున్నాయని అధికారులు తెలిపారు.ి

# ఆయుష్ మందుల నాణ్యత, సరఫరాపై లోక్‌సభలో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య



**ఉమ్మడి వరంగల్, మార్చి 13 (నేటి దర్శిని బ్యూరో):** వరంగల్ జిల్లాలో ప్రభుత్వ ఆయుష్ వైద్య సంస్థల్లో మందుల నాణ్యత, నిరంతర సరఫరాపై వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు. గత మూడు సంవత్సరాల్లో వరంగల్‌లోని ప్రభుత్వ ఆయుష్ కేంద్రాల్లో మందుల నాణ్యతపై ఎలాంటి తనిఖీలు నిర్వహించారో వివరాలు ఇవ్వాలని కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖను ఎంపీ కోరారు.అలాగే ఆయుష్ వైద్య కేంద్రాల్లో సరఫరా అయ్యే మందులపై సంవత్సరం వారీగా చేసిన తనిఖీలు, సేకరించిన నమూనాలు, పరీక్షల ఫలితాలు, నాసిరకం లేదా నకిలీగా తేలిన మందుల వివరాలు తెలియజేయాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించని తయారీదారులు లేదా సరఫరాదారులపై తీసుకున్న చర్యలు , లైసెన్స్ సస్పెన్షన్, రద్దు, బ్లాక్‌లిస్టింగ్, బకాయిల వసూళ్లు, కేసులు నమోదు వంటి చర్యలపై వివరాలు కోరారు.అదేవిధంగా, ఆయుష్ మందుల కొరత లేకుండా ఉండేందుకు నేషనల్ ఆయుష్ మిషన్ లేదా ఇతర కేంద్ర పథకాల కింద డిజిటల్ స్టాక్ మానిటరింగ్ వ్యవస్థ అమలు చేస్తున్నారా అనే అంశంపై కూడా ఎంపీ ప్రశ్నించారు.దీనికి సమాధానంగా కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాధవ్ మాట్లాడుతూ ప్రజారోగ్యం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండే అంశమని తెలిపారు. తెలంగాణలోని వరంగల్ సహా అన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ ఆయుష్ ఆసుపత్రులకు నాణ్యమైన మందుల సరఫరా బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన వివరాల ప్రకారం ఆయుష్ విభాగం ద్వారా మందుల నమూనాలను యాదృచ్ఛికంగా, బ్యాచ్ వారీగా సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. నాణ్యత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన మందులనే ఆసుపత్రులకు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. నాణ్యతలో లోపాలు తేలితే సరఫరాదారులు తమ ఖర్చుతోనే మందులను వెనక్కి తీసుకుని కొత్తవి అందజేయాల్సి ఉంటుందని తెలిపారు.అలాగే తెలంగాణలో ఈ–ఔషధి డిజిటల్ వ్యవస్థను అమలు చేసి ఆయుష్ మందుల నిల్వలు, సరఫరాను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఆయుష్ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు లేదా వైద్యాధికారులు ఈ వ్యవస్థ ద్వారా మందుల కోసం ఇండెంట్ పెట్టే అవకాశం ఉందని, స్టాక్ వివరాలు ఆన్లైన్లో అందుబాటులో ఉండటంతో అక్రమాలు, కొరతలను నివారించవచ్చని పేర్కొన్నారు.వరంగల్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఆయుష్ వైద్య వ్యవస్థ బలోపేతంపై ఎంపీ డా. కడియం కావ్య నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

## శ్రీ భద్రకాళి దేవాలయం నుంచి ఐస్లాండ్ మధ్యలో రోప్ వే ఏర్పాటు చేస్తాం: ఎమ్మెల్యే



**ఉమ్మడి వరంగల్, మార్చి 13 (నేటి దర్శిని బ్యూరో):** వరంగల్ నగరంలో ప్రసిద్ధి చెందిన శ్రీ భద్రకాళి దేవాలయాన్ని ప్రతి రోజూ 25 వేల మంది భక్తులు దర్శనం చేసుకునేలా దేవాలయాన్ని తీర్చిదిద్దాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శ్రీ భద్రకాళి దేవాలయం నుంచి సమీపంలోని ఐస్లాండ్ మధ్యన రూప్ వే నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. పి పి ఏ పద్ధతిలో సుమారు 50 కోట్ల అంచనా వ్యయముతో ప్రణాళిక రూపొందించి త్వరలోనే టెండర్లకు ఆహ్వానిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి ,అధికారులు పాల్గొన్నారు.


# ఎస్సీ కాలనీ లోని ప్రజల పదేళ్ల చిరకాల కలను నెరవేర్చిన ఎమ్మెల్యే నాగరాజు

- టేకులగూడెం ఎస్సీ కాలనీలో తాగునీటి మస్యకు పరిష్కారం
- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు కాలనీ వాసులు, మహిళల కృతజ్ఞతలు



**ఉమ్మడి వరంగల్, మార్చి 13 (నేటి దర్శిని బ్యూరో):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 64వ డివిజన్ పరిధిలోని టేకులగూడెం గ్రామ ఎస్సీ కాలనీలో చాలా సంవత్సరాలుగా కొనసాగుతున్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. గత పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పటి ఎమ్మెల్యేలకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా సమస్య పరిష్కారం కాలేదని కాలనీ వాసులు తెలిపారు. దాదాపు 10 నుంచి 15 సంవత్సరాలుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గత నెల రోజుల క్రితం వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుదృష్టికి సమస్యను తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించారు. కేవలం రెండు నెలల వ్యవధిలోనే రూ.25 లక్షల నిధులతో కొత్త పైప్‌లైన్ వేయించి కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించారు. దీంతో ఎస్సీ కాలనీ వాసులు, మహిళలు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా తమ సమస్యను త్వరితగతిన పరిష్కరించిన ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.ఎస్సీ కాలనీ ప్రజలు పదేళ్లుగా ఎదురుచూస్తున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించడం ఎంతో ఆనందంగా ఉందని, ప్రజల సమస్యలు తెలుసుకుని వెంటనే స్పందించి పరిష్కరించడం నా బాధ్యత అన్నారు. టేకులగూడెం ఎస్సీ కాలనీలో రూ.25 లక్షలతో పైప్‌లైన్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను తీర్చామని, ప్రజలకు అవసరమైన ప్రతి మౌలిక

## కాజీపేట రైల్వే జంక్షన్ 30 కోట్ల వ్యయంతో ఆధునీకరణ



**ఉమ్మడి వరంగల్, మార్చి 13 (నేటి దర్శిని బ్యూరో):** కాజీపేట రైల్వే జంక్షన్ ను కేంద్ర ప్రభుత్వం అత్యున్నత ప్రమాణాలతో ఆధునికరిస్తున్నారు. అమృత భారత్ స్టేషన్ పథకంలో భాగంగా సుమారు రూపాయల 30 కోట్ల వ్యయంతో రైల్వే జంక్షన్ లో ఆధునీకరణ పనులను చేపడుతున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం 12 మీటర్ల వెడల్పు తో అత్యాధునిక పాదాచారుల వంతెన,లిఫ్టులు , ఎస్కలేటర్లను ఏర్పాటు చేస్తున్నారు . అలాగే రైల్వే స్టేషన్ ముఖద్వారాన్ని ఆకర్షణీయంగా మారుస్తుండడంతో రైల్వేజంక్షన్ సరికొత్త రూపును సంతరించుకుంటుందని ప్రయాణికులు అనుకుంటున్నారు.

## జెసిపి తో పనులు మరమ్మత్తు చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి




**హాలియా, మార్చ్ 13( నేటి దర్శిని):** ప్రజా పాలన పట్టణ ప్రణాళిక 99 రోజుల లో భాగంగా శుక్రవారం హాలియా మున్సిపాలిటీ పరిధిలోని 7,8 వ వార్డులలో హాలియా మున్సిపాలిటీ చైర్మన్ చింతల చంద్రారెడ్డి గారి ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది మరియు జేసీబీ డోజర్ ట్రాక్టర్ లతో పేరూరు మేజర్ కాల్వ వెంబడి చెత్త చెదారం తొలగిస్తున్నారు,అదే విధంగా పారిశుద్ధ్య కార్మికులతో మురికి కాలువలు శుభ్రం చేయుట రోడ్ల వెంబడి గల చెట్లు దారికి అడ్డంగా ఉన్న కొమ్ములను తొలగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో 8 వ వార్డు కౌన్సిలర్ సలహాదారు నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షులు మజహర్ మొహియుద్దీన్ కున్రెడ్డి కృష్ణారెడ్డి ఖదీర్ ఎల్లయ్యచారి మహేష్ అల్లాద్దీన్ సత్యంచారి హేమంత్ డీజే మహేష్ వార్డు సభ్యులు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పశుసంపదను రక్షించేందుకు ఎఫ్ ఎం డి టీకాలు: ఎమ్మెల్యే

- రైతులు పాడి సంపదను పెంచి పాల ఉత్పత్తి పెంచాలని ఎమ్మెల్యే పిలుపు
- ఆవులు, బర్రెల కొనుగోలుకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని సూచన
- తెలంగాణలో పశుసంపద పెంపుకు రైతులు ముందుకు రావాలి
- పశువులకు ఉచిత ఎఫ్ ఎం డి టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**ఉమ్మడి వరంగల్, మార్చి 13 (నేటి దర్శిని బ్యూరో):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన , ప్రగతి ప్రణాళికలో భాగంగా హన్మకొండ జిల్లా ఐనవోలు మండలం పంతిని గ్రామంలోని పశువుల వైద్యశాలలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ కోసం నిర్వహిస్తున్న ఉచిత ఎఫ్ ఎం డి టీకాల కార్యక్రమాన్ని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజుమాట్లాడుతూ రాష్ట్రంలో పశు సంపదను పెంచడం, పశువులను వ్యాధుల నుంచి రక్షించడం లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఎఫ్ ఎం డి టీకాలను ఉచితంగా వేస్తున్నామని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. పాడి పంట వ్యవసాయానికి అనుబంధంగా ఆవులు, బర్రెల పెంపకం చాలా కాలంగా కొనసాగుతోందని, రైతులు పాడి సంపదను పెంచి పాల ఉత్పత్తిని అధికం చేయాలని కోరారు.రైతులకు ఆర్థికంగా లాభదాయకంగా ఉండే విధంగా ఆవులు, బర్రెల కొనుగోలుకు ప్రభుత్వం సహకరిస్తోందని ఎమ్మెల్యే నాగరాజు చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో పాడి సంపదను పెంపొందించడంలో రైతులు భాగస్వాములు కావాలని సూచించారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన , ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం గ్రామ నాయకులు గ్రామ పంచాయతీ, పశువుల వైద్యశాల కు కాంపౌండ్ హాల్, మహిళా భవన నిర్మాణం కోసం కృషి చేయాలని కోరాగా ఎమ్మెల్యే వెంటనే స్పందించి వాటిని పరిశీలించి మంజూరూ చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రామ్ భూపాల్, నర్సింహులగూడెం గ్రామ సర్పంచ్ పోలేపల్లి శివ శంకర్ రెడ్డి, ఐనవోలు ఆలయ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట్ట మహేష్ గౌడ్, గ్రామ కాంటెస్ట్ సర్పంచ్ బండి మహేందర్ గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు యాకర సాంబయ్య, మహిళ అధ్యక్షురాలు ఇల్లందుల ఎలీషా, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారీ రాధాకృష్ణ, పశుసంవర్ధక శాఖ అధికారులు మండల, గ్రామ నాయకులు , రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# చిన్నారులకు భవిష్యత్తుకు అండగా ఉంటా: మన్నెం రంజిత్ యాదవ్



**నిడమనూరు, మార్చి13( నేటి దర్శిని):**
తల్లిదండ్రులే పిల్లలకు పెద్ద ఆధారం కానీ విధి వక్రించడంతో నిడమనూరుకు చెందిన ముగ్గురు పసిమొగ్గలు చిన్న వయసులోనే జీవితంలో కఠిన కఠినత్వాన్ని ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే తల్లిని కోల్పోయిన ఆ చిన్నారులకు తాజాగా తండ్రి అశోక్ అనారోగ్యంతో మరణించడంతో వారు అనాథలయ్యారు. 13, 12, 9 ఏళ్ల వయసున్న ఆ చిన్నారులు ఇప్పుడు తమ నానమ్మ ఆశ్రయంలో భవిష్యత్తు కోసం పోరాడుతున్నారు. ఈ హృదయ విదారక విషయం తన అభిమాని పగిడిమర్రి అనిల్ ద్వారా తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకులు మన్నెం రంజిత్ యాదవ్ వెంటనే స్పందించి మానవత్వాన్ని చాటుకున్నారు. చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారి తక్షణ అవసరాల కోసం రూ 10,000/- (పది వేల రూపాయలు) ఆర్థిక సహాయం అందజేసి కుటుంబానికి ధైర్యం నింపారు. ఈ కార్యక్రమంలో రంజిత్ అన్న యువసేన సభ్యులు ఎదుళ్ల వినీల్ రెడ్డి, కడియం సైదులు, వట్టికోటి శ్రావణ్, పెదమామము ఉపేందర్, శ్రీకాంత్, పగిల్లా మహేష్, పగిడిమర్రి అనిల్, నజీర్, భార్గవ్, కోటేష్, తెల్కలపల్లి శ్రీను తదితరులు పాల్గొని చిన్నారుల కుటుంబానికి అండగా నిలిచారు.

# నల్గొండ జిల్లాలో ఘనంగా 'ఆల్ ఇండియా సమత సైనిక్ దళ్' ఆవిర్భావ వేడుకలు

- శతాబ్ది వసంతంలోకి అడుగుపెట్టిన బాబాసాహెబ్ సామాజిక విప్లవ సైన్యం
- కొండమల్లేపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద నీలి జెండాను ఆవిష్కరించిన జిల్లా అధ్యక్షులు మద్దిమడుగు భిక్షపతి



**కొండమల్లేపల్లి/నల్గొండ, మార్చి 13 (నేటి దర్శిని ):**
భారత రాజ్యాంగ నిర్మాత, నవభారత నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్వయంగా స్థాపించిన ప్రతిష్టాత్మక సామాజిక విప్లవ సైన్యం 'ఆల్ ఇండియా సమత సైనిక్ దళ్' (AISSD) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం నల్గొండ జిల్లాలో అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని కొండమల్లేపల్లి మండల కేంద్రంలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సమత సైనిక్ దళ్ నల్గొండ జిల్లా అధ్యక్షులు మద్దిమడుగు భిక్షపతి దళం యొక్క నీలి జెండాను ఆవిష్కరించి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మద్దిమడుగు భిక్షపతి మాట్లాడుతూ, 1927 మార్చి 13న బాబాసాహెబ్ అంబేద్కర్ అణగారిన వర్గాల ఆత్మగౌరవ రక్షణ కోసం, దేశంలో సామాజిక సమానత్వం సాధించడం కోసం ఈ క్రమశిక్షణతో కూడిన దళాన్ని ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. అంటరానితనం, కుల వివక్ష లేని సమసమాజ స్థాపనే లక్ష్యంగా అప్పట్లోనే అంబేద్కర్ యువతను ఒక తాటిపైకి తెచ్చారని ఆయన కొనియాడారు. నేటితో ఈ చారిత్రాత్మక సంస్థ విజయవంతంగా 99 ఏళ్లు పూర్తి చేసుకుని, 100వ సంవత్సరంలోకి (శతాబ్ది వసంతం) అడుగుపెడుతుండటం అణగారిన వర్గాల అందరికీ గర్వకారణమని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.
అంబేద్కర్ రూపొందించిన ఈ దళం శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో, గ్రామాల్లో అంబేద్కర్ వాదులు, బహుజన మేధావులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బాబాసాహెబ్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ ఒక క్రమశిక్షణ కలిగిన సైనికుడిలా పని చేయాలని, రాజ్యాంగ విలువల రక్షణకు నడుం బిగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఏకుల సురేష్, AISSD దేవరకొండ మాజీ అధ్యక్షులు అడెపు సతీష్, నియోజకవర్గ సభ్యులు గద్దల చంటి, చందంపేట అధ్యక్షులు సింగం హన్మంతు తమ గళాన్ని వినిపించారు. వీరితో పాటు AISSD సభ్యులు సతేరసాల ఏడుకొండల్, ఎనికా రేవంత్, చేపూరి అరుణ్, వెలుగు పవన్ కళ్యాణ్ మరియు పలువురు అంబేద్కర్ వాదులు, యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొని జై భీమ్ నినాదాలతో హోరెత్తించారు.

# ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**మహేశ్వరం, మార్చి13 (నేటి దర్శిని):**
మహేశ్వరం నియోజకవర్గంలోని మహేశ్వరం మండలం అమీర్పేట గ్రామంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ ఇఫ్తార్ విందుకు అమీర్పేట గ్రామానికి చెందిన ముస్లిం మైనారిటీ సోదరులు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని ముస్లిం సోదరులు ఘనంగా స్వాగతించి శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం మరింత బలపడాలని ఆకాంక్షిస్తూ ముస్లిం మైనారిటీ సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆర్కే పురం డివిజన్ రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు





**ఆర్కే పురం, మార్చి13 (నేటి దర్శిని):**
మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం వాసవి కాలనీ లో నిర్వహించిన సేవా కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉ టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు, పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిలుక ఉపేందర్ రెడ్డి నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తూ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. యువతను ఏకం చేయడంలో ఆయన పాత్ర ప్రశంసనీయమని కొనియాడారు. రాబోయే రోజుల్లో ఆయన రాజకీయంగా మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. భగవంతుడు ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలను ప్రసాదించాలని కోరుకుంటున్నానని, పార్టీ క్రమశిక్షణ గల కార్యకర్తగా, నాయకుడిగా ఆయన సేవలు మహేశ్వరం నియోజకవర్గానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు, తలాట రమేష్ నేత, సురేష్, ముప్పిడి లింగస్వామి గౌడ్, బొడ్డుపల్లి మహేందర్, జ్ఞానేశ్వర్ యాదవ్, శేఖర్ ముదిరాజ్, పగడాల శ్రీశైలం, కళ్యాణ్ యాదవ్, రామారావు, నర్సింహ రెడ్డి, వెంకట్ రెడ్డి, పెద్ద వూర సైదులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, స్టేషనరీ పంచిన కృష్ణ గోపాల్ సేవా సమితి










**హైదరాబాద్, మార్చి13 (నేటి దర్శిని):**
కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ మరియు అనాథాశ్రమ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు మరియు అవసరమైన స్టేషనరీ పంచి రాబోయే పరీక్షలకు ధైర్యంగా సిద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ, రాబోయే సమయం యువతకు చెందిందని, విద్యార్థులు కష్టపడి చదివి మంచి ర్యాంకులతో ఉత్తీర్ణులవ్వాలని ఆకాంక్షించారు. సమితి సభ్యులందరూ మీ విజయాన్ని కోరుకుంటూ ప్రార్థిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి కోశాధికారి కుష్ అగర్వాల్, జాయింట్ సెక్రటరీ మనోజ్ గుప్తాతో పాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు. అలాగే సునీల్ దారాడే, సతీష్ యాదవ్, సురేష్ ధవాలే తదితరులు కూడా పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

# 10వ తరగతి పరీక్షలకు విద్యార్థులకు ఆల్ ది బెస్ట్



**ఖమ్మం, మార్చి 13 (నేటి దర్శిని):**
10వ తరగతి వార్షిక పరీక్షలు రాస్తున్న విద్యార్థినీ, విద్యార్థులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు టి. పీ. సీ. సీ సభ్యులు, వైరా నియోజకవర్గం, కొణిజర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్డే నారాయణ రావు పేర్కొన్నారు. పరీక్షల సమయంలో భయాన్ని దూరం పెట్టి, ఆత్మవిశ్వాసంతో ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఆయన సూచించారు. క్రమశిక్షణతో చదివి, పట్టుదలతో శ్రమించిన విద్యార్థులు తప్పకుండా మంచి ఫలితాలు సాధిస్తారని తెలిపారు. ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని చేరుకొని, మంచి మార్కులతో విజయం సాధించి తల్లిదండ్రులకు, గురువులకు, అలాగే మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అలాగే పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకుని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల కష్టానికి తగిన ప్రతిఫలం లభించి, అద్భుతమైన మార్కులతో విజయం సాధించాలని ఆయన మనస్ఫూర్తిగా కోరుకున్నారు.10వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు ఇవే మా హృదయపూర్వక ఆశీస్సులు. ఆల్ ది బెస్ట్!

# ప్రత్యేక నిధులు కేటాయించండి...

- నగర మేయర్ ను కలిసిన కార్పొరేటర్ నిమ్మరాజుల రజిని రవి



**గోదావరిఖని: మార్చి13 (నేటి దర్శిని):**
రామగుండం కార్పొరేషన్ పరిధి 29వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మరాజుల రజిని రవి శుక్రవారం మేయర్ మహంకాళి స్వామి ని తన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామ పంచాయతీ గా ఉన్న లింగాపూర్ గ్రామం ఇటీవల కాలంలో మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం అయ్యింది. కావున మున్సిపల్ తరహాలో అభివృద్ధి కావాల్సిన అవసరం ఉంది. లింగాపూర్ గ్రామానికి అధిక నిధులు కేటాయించాలని రోడ్లు డ్రైనేజీలతో పాటు త్రాగునీరు, సాగు నీరు తదితర వ్యవస్థలు మెరుగుపరచాలని వారు కోరారు. దీనికి మేయర్ మహంకాళి స్వామి సానుకూలంగా స్పందించి త్వరలోనే డివిజన్ లో పర్యటన చేస్తానని ఆపై సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానాని హామీ ఇచ్చారు.

# వైద్య నిర్ణయాలకు స్పష్టత ఇచ్చే 'ది హోప్ కోడ్' ప్రారంభం




**హైదరాబాద్, మార్చి 13 (నేటి దర్శిని):**
వైద్య నిర్ణయాలకు స్పష్టనిచ్చేందుకు క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ ఖన్నా తన వ్యక్తిగత యూట్యూబ్ ఛానల్ 'ది హోప్ కోడ్' ను ప్రారంభించినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలో నమ్మకం, సరైన సమాచారం, వైద్య నిర్ణయాలను ఎలా అర్థం చేసుకోవాలనే అంశాలపై ఆలోచనాత్మక చర్చలు జరిపేందుకు ఈ వేదికను ప్రారంభించినట్లు తెలిపారు. ఆరోగ్య రంగం ఎంత క్లిష్టంగా ఉంటుందో, వైద్య నిర్ణయాలు ఎలా తీసుకోవాలి అనే విషయాలను సాధారణ ప్రజలు సులభంగా అర్థం చేసుకునేలా చేయడం, ఆరోగ్య వ్యవస్థలో ఉన్న వివిధ కోణాలను, అనుభవాలను ఈ వేదిక ద్వారా ప్రజలకు చేరవేయడం లక్ష్యం అన్నారు. భారత వైద్య రంగంలో ప్రముఖుడిగా గుర్తింపు పొందిన డాక్టర్ నరోత్తమ్ పురితో మొదటి సంభాషణ జరుగుతుందని చెప్పారు. ఆరోగ్యంపై నమ్మకం, సమాచారం, నిర్ణయాల గురించి లోతైన చర్చలకు ఇది ప్రారంభంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, RNI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365